Follow: @ANNTELUGU

27-09-2026

# మహా పత్రిక

తెలుగు

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 247 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## విజయవాడలో 'పేదలకు పట్టాభిషేకం'

- విజయవాడలో 'పేదలకు పట్టాభిషేకం'
- ఈ నెల 30న చంద్రబాబు చేతుల మీదుగా పట్టాలు
- 24,057 కుటుంబాలకు సంపూర్ణ యాజమాన్య హక్కులు

**విజయవాడ, మహా :** పేదలకు పూర్తిస్థాయి యాజమాన్య హక్కులు కల్పించే బృహత్తర కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం మరో ప్రతిష్ఠాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. దశాబ్దాలుగా నగరవాసులను వేధిస్తున్న ఇళ్ల పట్టాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కీలక ముందడుగు వేసింది. విశాఖపట్నంలో ఇటీవల విజయవంతంగా నిర్వహించిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమ స్ఫూర్తితో, ఇప్పుడు విజయవాడలో భారీ ఎత్తున ఇళ్ల క్రమబద్ధీకరణ పట్టాల పంపిణీకి సిద్ధమైంది. ఈ నెల 30వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా 24,057 కుటుంబాలకు సంపూర్ణ హక్కులతో కూడిన పట్టాలను అందించనున్నారు. విజయవాడలో ప్రతి ఎన్నికల్లోనూ ప్రధాన అజెండాగా మారుతున్న ఇళ్ల పట్టాల సమస్యకు కూటమి సర్కార్ చరమగీతం పాడుతోంది. దశాబ్దాల క్రితం అందించిన ఎన్టీఆర్ పట్టాలకు చట్టబద్ధత కల్పిస్తూ, వాటిపై మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్

## ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో పోటీచేస్తాం



- తెలంగాణ రక్షణ సేన అభ్యర్థిని బరిలో దింపుతాం
- కల్వకుంట్ల కవిత ప్రకటన

02

## జక్కన్న కాంపౌండ్ కోసం చీఫ్ గెస్ట్ గా తారక్



- సెప్టెంబర్ 29న గ్రాండ్ ప్రీ-రిలీజ్ వేడుక
- హైదరాబాద్ జేఆర్సీ కన్వెన్షన్‌లో కార్యక్రమం

02

## కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు రంగం సిద్ధం



- నవంబర్ రెండో వారం నుంచి పనులు ప్రారంభం
- 2027 వర్షా కాలం నాటికి పూర్తి చేయాలని లక్ష్యం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

03



## జనసేన తెలంగాణ ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ గడల శ్రీనివాసరావు

**హైదరాబాద్, మహా** : తెలంగాణ లో జనసేనను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ గడల శ్రీనివాసరావుని నియమించారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ యంత్రాంగాన్ని బలోపేతం చేయడంతో పాటు నాయకులు, కార్యకర్తలను సమాయత్తం చేయడంలో అత్యంత కీలకమైన పాత్ర పోషించేందుకే రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ గడల శ్రీనివాసరావు నియమించినట్లు తెలుస్తోంది.



## ఎంజీఆర్ వైపే కేసీఆర్ మొగ్గు



### ఖైరతాబాద్‌పై పక్కా స్ట్రాటజీ

ఉద్యమనేతకే గులాబీబాస్ అభయం

మన్నె గోవర్ధన్ రెడ్డిని గట్టిగా తిరగాలని ఆదేశం

గులాబీపార్టీలో జోష్

**(హైదరాబాద్ మహా) :** ఖైరతాబాద్ బైపోల్ టికెట్ ఈసారి ఉద్యమనేతకే ఇవ్వాలని కేసీఆర్ డిసైడ్ అయ్యారు. స్థానికంగా మంచిపట్టు, అందరితో అనుబంధం ఉండే మన్నె గోవర్ధన్ రెడ్డి కి ఇప్పటికే గులాబీదళపతి ఈమేరకు సంకేతాలిచ్చినట్లు తెలుస్తోంది. కేసీఆర్ ఫ్యామిలీకి అత్యంత సన్నిహితంగా ఉండే మన్నె గోవర్ధన్ రెడ్డి 2014లో టీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలోకి దిగారు. పార్టీని నియోజకవర్గంలో బలీయంగా తీర్చిదిద్దిన ఎంజీఆర్.. ఎన్నికల సమయంలో దానం నాగేందర్ గులాబీగూటికి రావడంతో సీటు త్యాగం చేశారు. ఆ త్యాగం రెండుసార్లు జరగ్గా, ఇపుడు దానిని సరిచేయాలని గులాబీదళపతి డిసైడ్ అయ్యారు. ఎంజీఆర్ పై మిగతా 2వ పేజీలో



## దేశం గర్వించే నేత..

## ఆర్థిక సంస్కరణల శిల్పి మన్మోహన్ సింగ్

గచ్చిబౌలిలో మన్మోహన్ సింగ్ విగ్రహావిష్కరణ

భవిష్యత్ తరాలకు మన్మోహన్ స్ఫూర్తిగా నిలవాలి : సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా :** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ దేశం గర్వించదగ్గ నేత అని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. జాతి రత్నాన్ని స్మరించుకోవడం తెలంగాణ ప్రజల అదృష్టమని అన్నారు. మన్మోహన్ సింగ్ పాలనలో తీసుకున్న నిర్ణయాలు, ముఖ్యంగా ఆర్థిక సరళీకరణ విధానాలు దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపాయని చెప్పారు. 1991లో పీవీ నరసింహారావు కేబినెట్ లో ఆర్థిక మంత్రిగా మన్మోహన్ సింగ్ చేపట్టిన సంస్కరణలు దేశం ఆర్థికంగా ఎదగడంతో ఎంతో కీలకమైనవని సీఎం చెప్పారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని విప్రో జంక్షన్ వద్ద మాజీ ప్రధాని, ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ కాంస్య విగ్రహాన్ని శనివారం సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఐటీ కారిడార్‌లో ఏర్పాటు చేయడం ద్వారా మన్మోహన్ దేశ ఆర్థిక రంగానికి చేసిన సేవలను గుర్తుచేసుకుంటున్నామని చెప్పారు. సీఎం మిగతా 3వ పేజీలో



నన్ను బీజేపీ తరపున పోటీ చేయమని

## జ్ఞానేశ్ కుమార్ ఆఫర్ ఇచ్చారు

- కేరళ మాజీ ఐఏస్ అధికారి సంచలనం
- కేంద్రమంత్రి అవుతానన్న జ్ఞానేశ్

02

## సీఈసీ రాజీనామా చేయాల్సిందే

- ఈసీ ప్రెస్ నోట్‌పై కాంగ్రెస్ ఫైర్
- ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని పట్టు

**ఢిల్లీ, మహా :** భారత ఎన్నికల సంఘం తీరుపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, ఆయనపై విచారణ జరపాలని డిమాండ్ చేసింది. ఓటర్ల జాబితా సవరణ పేరుతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఓటర్ల పేర్లను తొలగించే భారీ కుట్ర జరుగుతోందని ఆరోపించింది. మిగతా 2వ పేజీలో

## ప్రశాంతంగా ముగిసిన గణేశ్ నిమజ్జనం



విజయవంతమైన బందోబస్తుతో పోలీసుల సంబరాలు 02

సిబ్బందితో కలిసి డ్యాన్స్ చేసిన హైదరాబాద్ సీపీ సజ్జనార్




ప్రపంచ పటంలో

## రాష్ట్ర పర్యాటకానికి ప్రత్యేక గుర్తింపు



- ఏఐ, డిజిటల్ టెక్నాలజీతో టూరిజం రంగానికి కొత్త ఊపు
- ప్రపంచ పర్యాటక దినోత్సవం వేడుకలలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

02

## గణేష్ నిమజ్జనాల్లో 13 మంది మృతి

26 మందికి గాయాలు

డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడి



**హైదరాబాద్, మహా :** తెలంగాణలో వినాయక నిమజ్జన వేడుకల సందర్భంగా పలుచోట్ల విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ విషయం పై డిజిపి సివి ఆనంద్ ఆవేదన వ్యక్తం చేశారు. వినాయక నిమజ్జన బందోబస్తులో ఉన్న ఎస్సై ప్రమాదంలో మృతి చెందగా పటాన్ చెరువులో ఆరుగురు, ఖైరతాబాద్, నిర్మల్ లలో ఒక్కొక్కరు చొప్పున ప్రాణాలు కోల్పోయారు. అదేవిధంగా మిగతా 3వ పేజీలో



## ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు

02

12 యూనియన్లకు గుర్తుల కేటాయింపు

# ఎంజీఆర్ వైపే కేసీఆర్ మొగ్గు

( మొదటి పేజీ తరువాయి )

స్థానికంగా సానుభూతి ఉండగా, ఎపుడూ ప్రజల మధ్యనే ఉండడం ఆయన ప్రత్యేకత. తన భార్య కవితా రెడ్డిని రెండు సార్లు నియోజకవర్గంలోని వెంకటేశ్వ రకాలనీనుండి వరుసగా గెలిపించుకున్న ఎంజీఆర్ నియోజకవర్గంలో ప్రజలకు చేదోడువాదోడుగా, అందరివాడుగా నిలిచారు. ఖైరతాబాద్ నియోజకవ ర్గంలో 2లక్షలకు పైగా ఓటర్లుండే వీవీఐపీ నియోజక వర్గం. ఖైరతాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ తరుపున గెలిచి కాంగ్రెస్ లో చేరిన దానం నాగేందర్ ను పట్టుబట్టి అనర్హత వేటు వేయించడంలో కేసీఆర్ సక్సెస్ అయ్యారు. నియోజకవర్గంలో గట్టిగా తిరగా లని ముందు నుండీ కేసీఆర్ హెచ్చరిస్తూ ఎంజీఆర్ ను పరుగెత్తించారు. కేసీఆర్ చెప్పినట్లుగానే ఎన్నిక రాగా, గెలుపుమంత్రం ఏంటో చూడాలి. ఉప ఎన్నిక రావడంతో బీఆర్ఎస్ పార్టీలో జోష్ నెలకొనగా, ఎంజీఆర్ కు అధినేత అభయం ఉందన్న ప్రచారం స్థానిక ప్రజలను ఉత్సాహపరుస్తోంది. ఫిల్మ్ నగర్, సోమాజిగూడ, బంజారహిల్స్, జూబ్లిహిల్స్, హిమాయత్ నగర్, రాజ్ భవన్ వంటి ప్రాంతాలన్నీ ఈ నియోజక వర్గంలోకే వస్తాయి. సిటీలో అత్యంత కీలక నియోజక వర్గం ఖైరతాబాద్.



**ఇది ప్రతిష్టాత్మకం**

సిటీలో జరిగిన రెండు బైపోల్స్ లోనూ.. బీఆర్ఎస్ ఓటమిపాలైంది. రెండు సిట్టింగ్ స్థానాలను బీఆర్ఎస్ కోల్పోయింది. ఆ రెండు కోరుకోని ఎన్నికలు. ఇది బీఆర్ఎస్ కోరి తెప్పించిన ఎన్నిక. కేసీఆర్ ఈ ఎన్నికపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టినట్లు స్పష్టమవుతోంది. తలసాని సాయికిరణ్ తో పాటు ఇతర నేతలు ప్రయత్నిస్తున్నా కేసీఆర్ మొగ్గు ఎంజీఆర్ వైపే ఉంది. ఈ ఎన్నికకు కేటీఆర్ లేదా హరీష్ రావును ఇన్ ఛార్జిగా నియమించే అవకాశముంది. కేసీఆర్ కుటుంబానికి సన్నిహితుడైన గోవర్ధన్ రెడ్డి ఖైరతాబాద్ ప్రాంతంలో కేసీఆర్ పై అభిమానంతో ఎంతో చేశారు. పార్టీకోసం అనేక త్యాగాలు చేసినా ఇప్పటిదాకా సరైన అవకాశం దక్కించుకోలేదు. ఇపుడు అది భర్తీ అవుతుందని, స్వయంగా కేసీఆరే ఫోకస్ పెట్టడంతో ఖైరతాబాద్ పై గులాబీజెండా ఎగరేస్తామని బీఆర్ఎస్ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. సర్వేలలో కూడా మన్నె గోవర్ధన్ రెడ్డి అభ్యర్థి అయితేనే బీఆర్ఎస్ కు గెలుపు అవకాశం ఉందని వస్తోందని తెలిసింది. స్థానికంగా నిత్యం ప్రజలమధ్యలో ఉండడం అడ్వాంటేజ్ గా మారింది.

# ప్రపంచ పటంలో రాష్ట్ర పర్యాటకానికి ప్రత్యేక గుర్తింపు

- ఏఐ, డిజిటల్ టెక్నాలజీతో టూరిజం రంగానికి కొత్త ఊపు
- పీపీపీ విధానంలో మౌలిక వసతులు, పెట్టుబడుల ప్రోత్సాహం
- ప్రపంచ పర్యాటక దినోత్సవం వేడుకలలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, మహా :** రాష్ట్ర పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు డిజిటల్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లను విస్తృతంగా వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ప్రకృతి, చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంపదకు నిలయమైన తెలంగాణను ప్రపంచ పర్యాటక పటంలో అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని స్పష్టం చేశారు. "డిజిటల్ అజెండా - ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పర్యాటక రంగానికి కొత్త రూపు" అనే ఇతివృత్తంతో ప్రపంచ పర్యాటక దినోత్సవం-2026 వేడుకలు శనివారం శిల్పారామంలోని సంప్రదాయ వేదికలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఈ ఏడాది పర్యాటక దినోత్సవ ఇతివృత్తమైన "డిజిటల్ అజెండా - ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పర్యాటక రంగానికి కొత్త రూపు" ప్రాధాన్యతను వివరిస్తూ, ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా మన పర్యాటక రంగాన్ని పునర్నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర పర్యాటకాన్ని గ్లోబల్ వేదికపై ఆవిష్కరించే నూతన వెబ్‌సైట్‌ను, అద్భుత చిత్రాలతో రూపొందించిన కాఫీ టేబుల్ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. రాష్ట్రంలో హెల్త్, ఆలయ, గ్రామీణ, ప్రకృతి పర్యాటక రంగాలకు అపారమైన అవకాశాలున్నాయని భట్టి తెలిపారు. వికారాబాద్‌లో వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటు పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని గుర్తుచేశారు. టైగర్ రిజర్వులు, అడవులు, జలపాతాలు, ప్రాచీన ఆలయాలు, నగరంలోని చారిత్రక కట్టడాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయని, ప్రశాంతతను కోరుకునే వారికి తెలంగాణ సరైన వేదిక అని పేర్కొన్నారు. వీటిని అంతర్జాతీయంగా సరైన రీతిలో మార్కెటింగ్ చేయాలని అధికారులకు సూచించారు. గతంతో పోలిస్తే ఈసారి పర్యాటక రంగానికి బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం ఇచ్చామన్నారు. సందర్శకుల భద్రత, నాణ్యమైన వసతులకు తమ పాలసీలో పెద్దపీట వేసినట్లు చెప్పారు. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం పద్ధతిలో అంతర్జాతీయ స్థాయి హోటళ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి, భారీగా పెట్టుబడులను ఆకర్షించాలని స్పష్టం చేశారు. వారంలో ఐదు రోజులు తీవ్ర ఒత్తిడితో పనిచేసే హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను పర్యాటకం వైపు మళ్లించేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఇందుకోసం పర్యాటక శాఖ మంత్రి, కార్యదర్శి కలిసి ప్రముఖ ఐటీ కంపెనీల సీఈఓలు, పర్యాటక ప్రాజెక్టుల నిర్వాహకులతో త్వరలోనే సమావేశం కావాలని ఆదేశించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు 'టూరిజం కూపన్లు' అందించి వారాంతాల్లో తెలంగాణలోని ప్రకృతి ప్రాంతాలను సందర్శించేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. పర్యాటకం అనేది కేవలం వినోదం మాత్రమే కాదని, విభిన్న సంస్కృతుల సమ్మేళనానికి అద్దం పడుతుందని డిప్యూటీ సీఎం అభిప్రాయపడ్డారు. పర్యాటక శాఖ చేపడుతున్న నూతన కార్యక్రమాలను అభినందిస్తూ, తెలంగాణ పర్యాటక కీర్తి ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాలని ఆకాంక్షించారు.



నూతన కార్యక్రమాలకు శ్రీకారం

పునర్ రూపకల్పన (రీడిజైన్) చేసిన తెలంగాణ టూరిజం వెబ్‌సైట్, ఆన్‌లైన్ హోమ్‌స్టే రిజిస్ట్రేషన్ విధానం, కొత్త టూరిజం ట్రైలర్లు, ఇంటరాక్టివ్ ఆధారిత లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, తెలంగాణ పర్యాటక ప్రాంతాలపై కాఫీ టేబుల్ బుక్, అంశంపై వీడియో/పోస్టర్, ఎకో టూరిజంపై వీడియోను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా సూపరింటెండెంట్ నిఖిల్ దాస్, పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ వాణిప్రసాద్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ పురావస్తు శాఖ మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. "ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ అండ్ డిజిటల్ టెక్నాలజీ - ది ఫ్యూచర్ ఆఫ్ టూరిజం", ఎకో టూరిజం, ఫిల్మ్ టూరిజం, స్పోర్ట్స్ టూరిజం, హెరిటేజ్ టూరిజం తదితర రంగాల్లో వస్తున్న మార్పులు, అవకాశాలపై అంశంపై ప్యానెల్ చర్చ జరిగింది. ఈ సదస్సులో యువ టూరిజం క్లబ్‌ల విద్యార్థులు, టూరిస్ట్ పోలీస్, తెలంగాణ దర్శిని, శిక్షణ పొందిన గైడ్స్ , హోమ్‌స్టే పై పలువురు తమ అనుభవాలను పంచుకున్నారు. తర్వాత ఎక్సలెన్స్ అవార్డులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ వేడుకల్లో పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ వాణిప్రసాద్, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ గౌతమి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, టీజీఏ డైరెక్టర్ లక్ష్మి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ, సాహిత్య అకాడమీ సెక్రటరీ బాలాచారి, సినీ నటులు తిరువరూర్, ఫరియా అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.



## ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో పోటీచేస్తాం

**కల్వకుంట్ల కవిత ప్రకటన**

**హైదరాబాద్, మహా :** ఖైరతాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నికలో తెలంగాణ రక్షణ సేన పోటీ చేస్తుందని ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. ఉప ఎన్నికలో తమ అభ్యర్థిని నిలబెడతామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ పార్టీ మార్పు అంశంపైనా ఆమె స్పందించారు. ఓ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మరో పార్టీ తరపున ఎంపీగా పోటీ చేయడాన్ని తప్పుబట్టారు. ఇలాంటి చర్యలు సమర్థనీయం కాదన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణపైనా కవిత స్పందించారు. క్లరికల్ తప్పిదాల కారణంగా అధికారులు ఓట్లు తొలగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని అన్నారు. బీజేపీ ప్రోత్సాహంతో కుట్రపూరితంగా ఓట్ల తొలగింపు జరుగుతోందనే చర్చ ప్రజల్లో ఉందని కవిత పేర్కొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన గణేశ్ నిమజ్జనం

హైదరాబాద్, మహా : హైదరాబాద్ నగరంలో గణేశ్ నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తును విజయవంతంగా నిర్వహించడంతో పోలీసు యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ఈ సందర్భంగా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తన సిబ్బందితో కలిసి సంబరాలు జరుపుకున్నారు. నిమజ్జన ప్రక్రియ ముగిసిన అనంతరం, తెలంగాణ తల్లి ఫ్లైఓవర్ కింద పోలీసు సిబ్బందితో కలిసి సీపీ సజ్జనార్ నృత్యం చేశారు. 'ది ప్యారడైజ్' చిత్రంలోని 'ఆయా షేర్' పాటకు ఆయన చిందులేశారు. గత కొన్ని రోజులుగా విధుల్లో నిమగ్నమై అప్రమత్తంగా ఉన్న పోలీసులు, నిమజ్జనం ప్రశాంతంగా పూర్తి కావడంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఉన్నతాధికారి స్వయంగా వారితో కలవడంతో సిబ్బందిలో ఉత్సాహం రెట్టింపైంది. మరోవైపు, నగరంలో నిమజ్జన క్రతువు ముగియడంతో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలను ఎత్తివేశారు. సచివాలయం పరిసర ప్రాంతాలైన ట్యాంక్‌బండ్, లిబర్టీ, అసెంబ్లీ మార్గాల్లో వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సాధారణ స్థితికి చేరుకుంది. అనంతరం సజ్జనార్ మీడియాతో మాట్లాడుతూ.. నగరంలోని నాలుగు కమిషనరేట్ లలో గణేశ్ శోభాయాత్రలు విజయవంతంగా ముగిశాయని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన అన్నిశాఖల అధికారులను ఆయన అభినందించారు. హోం గార్డ్ నుంచి ఐపీఎస్‌ల వరకు అందరికీ పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఎక్కువగా నిమజ్జనాలు జరిగాయని ఆయన వెల్లడించారు. హైదరాబాద్‌లో వినాయక నిమజ్జన బందోబస్తు కోసం ఇతర జిల్లాల నుంచి సిబ్బందిని రప్పించామని ఆయన పేర్కొన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశామని ఆయన చెప్పారు. ఖైరతాబాద్, బాలాపూర్ గణేష్ విగ్రహాలను అనుకున్న సమయానికి నిమజ్జనం చేశామని సీపీ పేర్కొన్నారు. ఇందుకు సహకరించిన భాగ్యనగర్ ఉత్సవ సమితికి ధన్యవాదాలు తెలిపారు. ఈసారి గణేషుడి విగ్రహాలను దర్శించుకోడానికి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారన్నారు. ఖైరతాబాద్ గణపతిని 30 లక్షల మందికిపైగా, బాలాపూర్ గణపతిని 15 లక్షల మంది దర్శించుకున్నారని వెల్లడించారు. శోభాయాత్రాల్లో కొన్ని లోపాలను గుర్తించామని, రాబోయే రోజుల్లో వీటిని సరిదిద్దుకుని, మరింత మెరుగైన సేవలను అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. పోలీసు అధికారులు, సిబ్బంది 48 గంటల పాటు నిద్రాహారాలు లేకుండా బందోబస్తు నిర్వహించారని తెలిపారు. శోభాయాత్రలో కలర్ పేపర్ల వల్ల ఇబ్బంది అవుతోందని.. వచ్చే ఏడాది నుంచి వీటిని నిషేధించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అన్నదానం చేసే ప్రాంతాల్లో ఇష్టానుసారంగా చెత్తను పడేస్తున్నారని, దీని వల్ల భక్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆకతాయిలు, అల్లరి మూకలపై చర్యలు ఉంటాయని సీపీ హెచ్చరించారు.



# సీఈసీ రాజీనామా చేయాల్సిందే ఈసీ ప్రెస్ నోట్‌పై కాంగ్రెస్ ఫైర్

**ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని పట్టు**

ఢిల్లీ, మహా : భారత ఎన్నికల సంఘం తీరుపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, ఆయనపై విచారణ జరపాలని డిమాండ్ చేసింది. ఓటర్ల జాబితా సవరణ పేరుతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఓటర్ల పేర్లను తొలగించే భారీ కుట్ర జరుగుతోందని ఆరోపించింది. ఈ సవరణ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ శనివారం గట్టిగా పట్టుబట్టింది. ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలు ఉన్నాయంటూ మీడియాలో వచ్చిన కథనాల నేపథ్యంలో, ఈసీఐ నేడు ఓ ప్రెస్ నోట్ విడుదల చేసింది. ఈ వివరణ కాంగ్రెస్ ఆగ్రహాన్ని మరింత పెంచింది. ఈసీఐ ఇప్పుడు ఆత్మరక్షణలో పడిందని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ జైరాం రమేశ్ విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా వరుస పోస్టులతో ఈసీఐని, సీఈసీని లక్ష్యంగా చేసుకుని పలు ప్రశ్నలు సంధించారు. "మీడియా కథనాల్లో వచ్చిన ఆరోపణలను ఈసీఐ తన ప్రెస్ నోట్‌లో ఎక్కడా నేరుగా ఖండించలేదు. వాటి తీవ్రతను తగ్గించే ప్రయత్నం మాత్రమే చేసింది. గోవా విషయంలో తప్పు చేసి దొరికిపోయాక, తొలగించిన 97 మందిలో 81 మంది పేర్లను తిరిగి చేర్చామని సిగ్గులేకుండా చెబుతోంది. అంటే, మొదట ఓటర్ల హక్కును కాలరాసి, దొరికిపోయాక మళ్లీ వారి పేర్లను చేర్చుతున్నామని చెప్పడం ఎంతవరకు సమంజసం?" అని జైరాం రమేశ్ ప్రశ్నించారు. ఢిల్లీ, మహారాష్ట్రల్లో ఓటరు నమోదు గడువును పొడిగించిన ఈసీఐ.. కర్ణాటక, తెలంగాణ, బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అన్యాయంగా ఓటు హక్కు కోల్పోయిన వారి పరిస్థితి ఏంటని నిలదీశారు. కేవలం ఒక వ్యక్తి అవినీతి వల్ల ఓటు హక్కు కోల్పోయిన ఈ రాష్ట్రాల ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఈసీఐకి లేదా అని ఆయన అన్నారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు ఐఐటీ/ట్రిపుల్ ఐటీ నిపుణులతో ఈసీనెట్ పోర్టల్‌ను సమీక్షిస్తామని చెప్పడం, సమస్య ఉందని అంగీకరించడమేనని జైరాం రమేశ్ పేర్కొన్నారు. సీఈసీ ఏకపక్ష నిర్ణయాలు, ప్రతిపక్షాలపై ద్వేషం, అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం, ముఖ్యంగా యువ ఓటర్లను (జెన్ Z) లక్ష్యంగా చేసుకోవడం వంటి అంశాలు ఆయన అవినీతిని బయటపెట్టాయని ఆరోపించారు. ఫారం 6లో పార్లమెంటు ఆమోదం లేకుండా మార్పులు చేసి, యువత ఓటు నమోదు చేసుకోకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. సీఈసీ బ్యూరోక్రసీ ముసుగులో దాక్కోవాలని చూస్తున్నారని, కానీ ఆయన బండారం బట్టబయలైందని జైరాం రమేశ్ అన్నారు. దేశమంతా ఆయనను జవాబుదారీ చేయాలని చూస్తోందని, ఈ నేపథ్యంలో సీఈసీ రాజీనామా లేదా ఆయనపై విచారణ జరపడం మినహా మరో మార్గం లేదని స్పష్టం చేశారు.



## నన్ను బీజేపీ తరపున పోటీ చేయమని జ్ఞానేశ్ కుమార్ ఆఫర్ ఇచ్చారు

మహా : అగ్నికి ఆజ్యం పోసినట్లుగా కేరళం రాష్ట్ర మాజీ ఐఏఎస్ ఆఫీసర్..జ్ఞానేశ్ కుమార్ పై సంచలన వ్యాఖ్యలు చేశారు కేరళ మాజీ ముఖ్య కార్యదర్శి జిజి థామ్సన్ మాట్లాడుతూ.. తాను 2016 లో కేరళలో చీఫ్ సెక్రటరీగా పని చేస్తున్న సమయంలో జ్ఞానేశ్ కుమార్ తనను బీజేపీ టికెట్ పై పోటీ చేయమని కోరినట్లు వెల్లడించారు. " 2016 లో నేను ఓ విమాన జర్నీలో ఉన్నప్పుడు జ్ఞానేశ్ కుమార్ నా ముందు ఈ ఆఫర్ పెట్టారు. నేను అదే సంవత్సరం రిటైర్ కావాల్సి ఉంది. నా ఫ్యూచర్ ప్లాన్స్ గురించి అడిగిన కుమార్.. 2019 లోక్ సభ ఎలక్షన్స్ లో కేరళ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయమని సలహా ఇచ్చారు. నేను కూడా యూనియన్ మినిస్టర్ అవుతానని నాతో చెప్పాడు. నాకు ఆసక్తి లేక అతని ఆఫర్ ను తోసిపుచ్చాను. బీజేపీ నాయకుల నుంచి కాకుండా ఓ ఐఏఎస్ నుంచి ఇలాంటి ఆఫర్ రావడంతో నాకు ఆశ్చర్యం వేసింది" అని జిజి థామ్సన్ వెల్లడించారు.

# సీఈసీ రాజీనామా చేయాల్సిందే

( మొదటి పేజీ తరువాయి )

ఈ సవరణ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ శనివారం గట్టిగా పట్టుబట్టింది. ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలు ఉన్నాయంటూ మీడియాలో వచ్చిన కథనాల నేపథ్యంలో, ఈసీఐ నేడు ఓ ప్రెస్ నోట్ విడుదల చేసింది. ఈ వివరణ కాంగ్రెస్ ఆగ్రహాన్ని మరింత పెంచింది. ఈసీఐ ఇప్పుడు ఆత్మరక్షణలో పడిందని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ జైరాం రమేశ్ విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా వరుస పోస్టులతో ఈసీఐని, సీఈసీని లక్ష్యంగా చేసుకుని పలు ప్రశ్నలు సంధించారు. "మీడియా కథనాల్లో వచ్చిన ఆరోపణలను ఈసీఐ తన ప్రెస్ నోట్‌లో ఎక్కడా నేరుగా ఖండించలేదు. వాటి తీవ్రతను తగ్గించే ప్రయత్నం మాత్రమే చేసింది. గోవా విషయంలో తప్పు చేసి దొరికిపోయాక, తొలగించిన 97 మందిలో 81 మంది పేర్లను తిరిగి చేర్చామని సిగ్గులేకుండా చెబుతోంది. అంటే, మొదట ఓటర్ల హక్కును కాలరాసి, దొరికిపోయాక మళ్లీ వారి పేర్లను చేర్చుతున్నామని చెప్పడం ఎంతవరకు సమంజసం?" అని జైరాం రమేశ్ ప్రశ్నించారు. ఢిల్లీ, మహారాష్ట్రల్లో ఓటరు నమోదు గడువును పొడిగించిన ఈసీఐ.. కర్ణాటక, తెలంగాణ, బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అన్యాయంగా ఓటు హక్కు కోల్పోయిన వారి పరిస్థితి ఏంటని నిలదీశారు. కేవలం ఒక వ్యక్తి అవినీతి వల్ల ఓటు హక్కు కోల్పోయిన ఈ రాష్ట్రాల ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఈసీఐకి లేదా అని ఆయన అన్నారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు ఐఐటీ/ట్రిపుల్ ఐటీ నిపుణులతో ఈసీనెట్ పోర్టల్‌ను సమీక్షిస్తామని చెప్పడం, సమస్య ఉందని అంగీకరించడమేనని జైరాం రమేశ్ పేర్కొన్నారు. సీఈసీ ఏకపక్ష నిర్ణయాలు, ప్రతిపక్షాలపై ద్వేషం, అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం, ముఖ్యంగా యువ ఓటర్లను (జెన్ Z) లక్ష్యంగా చేసుకోవడం వంటి అంశాలు ఆయన అవినీతిని బయటపెట్టాయని ఆరోపించారు. ఫారం 6లో పార్లమెంటు ఆమోదం లేకుండా మార్పులు చేసి, యువత ఓటు నమోదు చేసుకోకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. సీఈసీ బ్యూరోక్రసీ ముసుగులో దాక్కోవాలని చూస్తున్నారని, కానీ ఆయన బండారం బట్టబయలైందని జైరాం రమేశ్ అన్నారు. దేశమంతా ఆయనను జవాబుదారీ చేయాలని చూస్తోందని, ఈ నేపథ్యంలో సీఈసీ రాజీనామా లేదా ఆయనపై విచారణ జరపడం మినహా మరో మార్గం లేదని స్పష్టం చేశారు.

# విజయవాడలో 'పేదలకు పట్టాభిషేకం'

( మొదటి పేజీ తరువాయి )

లబ్ధిదారులకు పూర్తి యాజమాన్య హక్కులను కట్టబెడుతోంది. ఈ కార్యక్రమం ద్వారా సుమారు రూ. 9,800 కోట్ల విలువైన 617 ఎకరాల భూమిపై పేద, మధ్య తరగతి కుటుంబాలకు అధికారం లభించనుంది. దీనివల్ల ఒక్కో కుటుంబానికి సుమారు రూ. 40 లక్షల నుంచి రూ. 45 లక్షల వరకు లబ్ధి చేకూరనుంది. ముఖ్యంగా, విజయవాడ నగరంలోని మూడు నియోజకవర్గాల పరిధిలో కొండలపై ఇళ్లు నిర్మించుకున్న వారి చిరకాల స్వప్నం ఈ కార్యక్రమంతో నెరవేరబోతోంది. తమ ఇళ్లకు శాశ్వత భద్రత, భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కొండ ప్రాంత నివాసితులు ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల జరిగిన జిల్లా ప్రజాప్రతినిధుల సమావేశంలోనూ ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ప్రతినిధులు ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం వేగంగా స్పందించి, ఇప్పుడు 29.86 లక్షల చదరపు గజాల స్థలంపై లబ్ధిదారులకు సంపూర్ణ హక్కులు కల్పిస్తోంది. క్రమబద్ధీకరణ చేస్తున్న భూముల మార్కెట్ విలువ దాదాపు రూ. 24,297 కోట్లుగా ఉంటుందని అంచనా. ఈ పట్టాల పంపిణీ ద్వారా ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు, కృష్ణా జిల్లాలోని గన్నవరం సహా మొత్తం 8 నియోజకవర్గాల్లోని 15 మండలాల ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. సామాజిక వర్గాల వారీగా చూస్తే బీసీలు 12,093, ఓసీలు 6,130, ఎస్సీలు 4,546, ముస్లిం బీసీలు 955, ఎస్టీలు 333 కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నాయి.



**నియోజకవర్గాల వారీగా లబ్ధిదారుల సంఖ్య:**

| | |
|---|---|
| విజయవాడ (తూర్పు) | 7,990 |
| విజయవాడ (పశ్చిమం) | 7,465 |
| విజయవాడ (సెంట్రల్) | 5,815 |
| గన్నవరం | 602 |
| జగ్గయ్యపేట | 1,135 |
| మైలవరం | 981 |
| నందిగామ | 54 |
| తిరువూరు | 15 |

# ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు



**12 యూనియన్లకు గుర్తుల కేటాయింపు**

**హైదరాబాద్, మహా** : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ)లో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ప్రక్రియ ఊపందుకుంది. సీక్రెట్ బ్యాలెట్ విధానంలో జరగనున్న ఈ ఎన్నికల్లో పోటీ పడుతున్న 12 కార్మిక సంఘాలకు ఎన్నికల గుర్తులను కేటాయిస్తూ రిటర్నింగ్ అధికారి, జాయింట్ లేబర్ కమిషనర్ శనివారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు 'ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్' (టీఎంయూ)కు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనుమతినిచ్చారు. గుర్తుల కేటాయింపు పూర్తి కావడంతో ఆయా సంఘాల నేతలు ప్రచారానికి సమాయత్తమవుతున్నారు. కార్మిక సంఘాలు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని అధికారులు స్పష్టం చేశారు. కాగా... గుర్తింపు సంఘం ఎన్నికల పోలింగ్ అక్టోబర్ 9న జరగనుంది. సుదీర్ఘ విరామం తర్వాత (దాదాపు 8 ఏళ్ల విరామం) కార్మిక శాఖ ఈ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే.

### కేటాయించిన గుర్తులు

- ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ): బస్సు
- తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ): నిచ్చెన
- స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్.డబ్ల్యు.ఎఫ్): నక్షత్రం
- నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ): దివిటీ పట్టుకున్న చేయి
- కార్మిక సంఘ్: పులి
- కార్మిక పరిషత్: బస్సు టైరు
- బహుజన వర్కర్స్ యూనియన్: కత్తెర
- తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్: విల్లుబాణం
- స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్: త్రాసు
- సామాజిక తెలంగాణ మజ్దూర్ యూనియన్: బతుకమ్మ
- బహుజన కార్మిక యూనియన్: ధర్మ చక్రం
- తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్: గద

## జక్కన్న కాంపౌండ్ కోసం చీఫ్ గెస్ట్ గా తారక్

**సినిమాబ్యూరో:** మ్యాన్ ఆఫ్ మాసెస్, యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ అభిమానులకు పూనకాలు తెప్పించే శుభవార్త వచ్చేసింది. సినిమా షూటింగ్ లో భుజానికి గాయం కావడంతో గత కొన్ని వారాలుగా కెమెరాలకు, ప్రమోషన్లకు దూరంగా ఉంటూ విశ్రాంతి తీసుకుంటున్నారు తారక్. ఇప్పుడు కాస్త కోలుకోవడంతో మళ్లీ సందడి చేసేందుకు మైక్ పట్టుకోబోతున్నారు. విలక్షణ నటుడు ఫహద్ ఫాజిల్ కథానాయకుడిగా నటించిన విజువల్ వండర్ 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' ప్రీరిలీజ్ ఈవెంట్ కి ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. జక్కన్న కాంపౌండ్ కోసం, తన గాయాన్ని కూడా లెక్కచేయకుండా తారక్ ఈ గ్రాండ్ ఈవెంట్ కి ఓకే చెప్పారు. సెప్టెంబర్ 29న హైదరాబాద్‌లోని జేఆర్సీ కన్వెన్షన్‌లో ఈ వేడుక అత్యంత ఘనంగా జరగనుంది. దీనిపై మేకర్స్ ఒక ఫన్నీ వీడియో రిలీజ్ చేసి.. ఎన్టీఆర్ రాకను అధికారికంగా కన్ఫర్మ్ చేశారు.



# ఆర్థిక సంస్కరణల శిల్పి మన్మోహన్ సింగ్

( మొదటి పేజీ తరువాయి )

రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మన్మోహన్ సింగ్ పాలన, ఆలోచనలు జెన్‌జీతో పాటు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవాలని అన్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో రైట్ టు ఇన్ఫర్మేషన్, రైట్ టు ఎడ్యుకేషన్, ఉపాధి హామీ, ఫారెస్ట్ రైట్స్, భూసేకరణ వంటి చట్టాలు, పథకాలు అమల్లోకి వచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలోనూ అప్పటి కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను సీఎం గుర్తుచేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చేసిన సేవలను దేశం ఎప్పటికీ మర్చిపోదన్నారు సీఎం. అలాంటి గొప్ప వ్యక్తికి భారత రత్న ఇచ్చేందుకు అభ్యంతరం ఏందని ప్రశ్నించారు. మన్మోహన్ సింగ్ జ్ఞాపకార్థం కనీసం స్థలం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు సీఎం. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కు భారత్ రత్న ఇచ్చి గౌరవించాలని ప్రధాని మోదీని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో మెమోరియల్ ఇనిస్టిట్యూషన్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమానికి సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వీ. రమణతో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. మన్మోహన్ సింగ్ దార్శనికత, ఆర్థిక సంస్కరణలు, ప్రజా జీవితంలో ఆయన పాత్రను స్మరించుకున్నారు.

# గణేష్ నిమజ్జనాల్లో 13 మంది మృతి

(మొదటి పేజీ తరువాయి )



డీజే సౌండ్స్ తో గుండెపోటుకు గురై మరో వ్యక్తి మృతి చెందారు. నిమజ్జనాలలో 13 మంది మృతి చెందడం బాధాకరమని మీడియాతో డీజీపీ అన్నారు. నిమజ్జనాలలో మొత్తం 26 మంది గాయపడగా ఒక్క మల్కాజిగిరిలోనే 16 మందికి గాయాలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆరు విడతల్లో నిమజ్జనాలు జరుగగా హైదరాబాదులో గణేష్ నిమజ్జనాల విగ్రహాల నిమజ్జనం పూర్తయింది. రాష్ట్రవ్యాప్తంగా వినాయక నిమజ్జన కార్యక్రమాలు అత్యంత భద్రత వాతావరణంలో కొనసాగాయి. ఐసీసీసి, డిజిపి కార్యాలయం నుంచి నిమజ్జన ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించినట్లు డిజిపి ఆనంద్ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జియో టాకింగ్ సంబంధిత పోర్టల్ లో నమోదైన సమాచారం ప్రకారం ఈ ఏడాది పబ్లిక్ ప్లేస్లలో 1.24 లక్షల వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసినట్లు గుర్తించామని డిజిపి తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి 8 వేల విగ్రహాలు అదనంగా ఏర్పాటైనట్లు ఆయన చెప్పారు. హైదరాబాదులో నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ విస్తృత భద్రత ఏర్పాట్లు చేపట్టిందని డీజిపి తెలిపారు.



# ఆధార్‌ను ఏమార్చిన కవలలు

**సాంకేతికతకే సవాల్ విసిరిన వింత ఘటన.**

**ఢిల్లీ, మహా:** ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్‌లో చోటు చేసుకున్న ఓ విచిత్ర ఘటన ఆధార్ బయోమెట్రిక్ వ్యవస్థకే సవాల్ విసిరింది. ఎవరి వేలిముద్రలు, కంటిపాప (ఐరిస్) నమూనాలు వారికే ప్రత్యేకం అని, ప్రపంచంలో ఇద్దరు వ్యక్తుల బయోమెట్రిక్స్ ఒకేలా ఉండవని భావించే ఆధునిక సాంకేతికత.. ఇద్దరు కవలల విషయంలో మాత్రం పూర్తిగా బోల్తా పడింది. రాంపూర్‌లోని ఖారీ కువాన్ ప్రాంతానికి చెందిన జుబేర్ ఇలియాస్ కుమార్తెలు ఖిజ్రా జుబేర్, తూబా జుబేర్ పదో తరగతి చదువుతున్నారు. రాబోయే బోర్డు పరీక్షల రిజిస్ట్రేషన్ కోసం వీరు బయోమెట్రిక్ వివరాలు అప్‌డేట్ చేస్తుండగా ఒకరి వేలిముద్రలు, కంటిపాపలు మరొకరితో నూరు శాతం సరిపోలడంతో ఆధార్ సిస్టమ్ దానిని డూప్లికేట్ గా పరిగణించి రెండో అమ్మాయి అప్లికేషన్‌ను పదేపదే తిరస్కరించింది. రాంపూర్‌లోని సెయింట్ మేరీస్ స్కూల్‌లో చదువుతున్న ఈ కవలల మధ్య ఉన్న అసాధారణ పోలికలు చూసి వారి కుటుంబ సభ్యులే ఆశ్చర్యపోయేవారు. ఒకసారి తండ్రి తన మొబైల్‌కు ఒక అమ్మాయి ముఖంతో ఫేస్ లాక్ సెట్ చేయగా, రెండో అమ్మాయి ముఖం చూపించినా ఆ ఫోన్ సులభంగా అన్‌లాక్ కావడం గమనార్హం. ముఖ కవళికల్లోనే కాకుండా కంటిపాపలు, వేలిముద్రల్లోనూ ఎటువంటి వ్యత్యాసం లేకపోవడంతో ఆధార్ ప్రక్రియ ముందుకు సాగలేదు. పదో తరగతి పరీక్షల రిజిస్ట్రేషన్ ఆగిపోయి విద్యార్థినుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందన్న తీవ్ర ఆందోళనతో వారి చిన్నాన్న మక్సూద్ అహ్మద్ తదితరులు స్థానిక ఆధార్ కేంద్రాల చుట్టూ తిరిగినా ఎలాంటి ప్రయోజనం శూన్యం.చివరకు ఇక లాభం లేదనుకున్న కుటుంబ సభ్యులు రాంపూర్ జిల్లా మేజిస్ట్రేట్ (డీఎం) అజయ్ కుమార్ ద్వివేదిని 'జనతా దర్శన్' కార్యక్రమంలో కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. సమస్య తీవ్రతను, పిల్లల విద్యాభవిష్యత్తును దృష్టిలో ఉంచుకున్న కలెక్టర్.. దీనిని 'రేయరెస్ట్ ఆఫ్ ది రేర్' (అత్యంత అరుదైన) కేసుగా అభివర్ణించారు. కవలల్లో కూడా ఎక్కడో ఒకచోట బయోమెట్రిక్‌లో చిన్నపాటి తేడా ఉంటుందని, కానీ ఈ కేసులో ఏమాత్రం తేడా లేకపోవడం ఆశ్చర్యకరమని ఆయన వ్యాఖ్యానించారు. వెంటనే ఆయన ప్రత్యేక చొరవ తీసుకుని న్యూఢిల్లీలోని యూఐడీఏఐ ప్రధాన కార్యాలయంతో పాటు, లక్నోలోని ఉన్నతాధికారులతో నేరుగా సంప్రదింపులు జరిపారు.దాదాపు మూడు నుంచి నాలుగు నెలల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ ప్రక్రియలో అధికారులు సాంకేతిక లోపాలను సునిశితంగా పరిశీలించారు. యూఐడీఏఐ నిపుణులు ప్రత్యేక మాన్యువల్ వెరిఫికేషన్ ద్వారా పాత రికార్డులను పూర్తిగా తొలగించి, ఇద్దరు విద్యార్థినులకు వేర్వేరుగా కొత్త ఆధార్ కార్డులను జారీ చేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మరోవైపు పదో తరగతి బోర్డు పరీక్షల రిజిస్ట్రేషన్ గడువు మించిపోతుండటంతో, కొత్తగా అప్‌డేట్ అయిన ఆధార్ కార్డులను డీఎం అజయ్ కుమార్ ఏకంగా నేరుగా వారి పాఠశాలకే పంపించి పిల్లల విద్యా సంవత్సరానికి ఎలాంటి ఆటంకం కలగకుండా చూశారు. సుమారు ఏడాదిన్నర పాటు ఎటు తేలని సమస్యకు, కలెక్టర్ చొరవతో పరిష్కారం లభించడంతో మానసిక క్షోభ అనుభవించిన కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకుని జిల్లా యంత్రాంగానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రెండు రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు..వాతావరణ శాఖ హెచ్చరిక

**హైదరాబాద్, మహా** : తెలంగాణ వ్యాప్తంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. రాగల 48 గంటల పాటు రాష్ట్రంలో పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. శనివారం మధ్యాహ్నం రిపోర్ట్ ప్రకారం రాబోయే రెండు రోజులలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురు గాలులతో కూడి వర్షాలు పడే సూచనలున్నాయి. సెప్టెంబర్ 27 ఉదయం 8:30 వరకు కొమరంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, రంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు మరియు ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. సెప్టెంబర్ 27 ఉదయం 8:30 నుండి సెప్టెంబర్ 28 ఉదయం 8:30 వరకు జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి.

# కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు రంగం సిద్ధం

- **నవంబర్ రెండో వారం నుంచి పనులు ప్రారంభం**
- **2027 వర్షా కాలం నాటికి పూర్తి చేయాలని లక్ష్యం**
- **మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి**



**హైదరాబాద్, మహా :** కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులు నవంబర్ రెండో వారంలో ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. హైదరాబాద్‌లో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. బ్యారేజీల పునరుద్ధరణకు సంబంధించిన డిజైన్లను అక్టోబర్ 5న కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) సాంకేతిక పర్యవేక్షణ కమిటీకి సమర్పించనున్నట్లు మంత్రి తెలిపారు. కేంద్రం నుంచి అవసరమైన సాంకేతిక అనుమతులు లభించిన వెంటనే పనులు మొదలుపెడతామని స్పష్టం చేశారు. 2027 వర్షాకాలం నాటికి ఈ మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. బ్యారేజీల భద్రత, నాణ్యత విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) సహా నిపుణుల కమిటీలు లేవనెత్తిన అభ్యంతరాలను, సూచనలను పరిగణనలోకి తీసుకున్నామని, జాతీయ స్థాయి సాంకేతిక సంస్థల సిఫార్సుల మేరకే పనులు చేపడతామని వెల్లడించారు. ఈ మూడు బ్యారేజీల భద్రతను పటిష్ఠం చేసి, వాటి పూర్తి సామర్థ్యాన్ని పునరుద్ధరించడమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని ఆయన ఈ సమావేశంలో నొక్కిచెప్పారు.

# నివృత్తి డీఅడిక్షన్ కేంద్రాలకు ఎస్కోచ్ అవార్డు

- **తెలంగాణ జైళ్ల శాఖ వినూత్న కార్యక్రమానికి జాతీయ గుర్తింపు**




**కుషాయిగూడ, మహా :** తెలంగాణ జైళ్లు, కరెక్షనల్ సర్వీసెస్ శాఖ చేపట్టిన 'నివృత్తి' డీఅడిక్షన్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిష్ఠాత్మక ఎస్కోచ్ అవార్డు-2026 లభించింది. న్యూఢిల్లీలోని ఇండియా హ్యాబిటాట్ సెంటర్‌లో నిర్వహించిన 109వ ఎస్కోచ్ సమ్మిట్-ఇండియా ఎకనామిక్ ఫోరంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. ఖైదీల్లో మాదకద్రవ్యాల వినియోగ సమస్యను పరిష్కరించేందుకు చేపట్టిన పునరావాస ఆధారిత విధానాన్ని గుర్తిస్తూ ఈ అవార్డును ప్రదానం చేశారు. తెలంగాణ జైళ్లు, కరెక్షనల్ సర్వీసెస్ డీజీ డా. సౌమ్య మిశ్రా ఐపీఎస్ ఈ అవార్డును స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్కోచ్ లా ఆఫీసెస్ వ్యవస్థాపకుడు రోహన్ కొచర్, ఎస్కోచ్ గ్రూప్ చైర్మన్ సమీర్ కొచర్, జైళ్ల శాఖ డీఐజీ ఎం. సంపత్ పాల్గొన్నారు.

**4,200 మందికి స్క్రీనింగ్**

'డ్రగ్‌ఫ్రీ తెలంగాణ' లక్ష్యానికి అనుగుణంగా నివృత్తి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మాదకద్రవ్య డిమాండ్ తగ్గింపు జాతీయ కార్యాచరణ ప్రణాళిక సహకారం అందిస్తోంది. ఇందులో భాగంగా 4,200 మంది ఖైదీలను మాదక ద్రవ్య వినియోగ సమస్యల కోసం స్క్రీనింగ్ చేయగా.. 2,126 మందికి డబ్ల్యూహెచ్ఓ-అసిస్ట్ స్క్రీనింగ్ నిర్వహించి కౌన్సెలింగ్, చికిత్స అందించారు. విడుదలైన 300 మంది ఖైదీలకు అనంతరం కూడా అవసరమైన సహాయాన్ని అందించారు.

**ఐదు జైళ్లలో కేంద్రాలు**

నివృత్తి డీఅడిక్షన్ కేంద్రాలను హైదరాబాద్ చంచల్‌గూడ కేంద్ర కారాగారం, చర్లపల్లి, సంగారెడ్డి, నిజామాబాద్ కేంద్ర కారాగారాలతో పాటు హైదరాబాద్‌లోని మహిళా ప్రత్యేక కారాగారంలో ఏర్పాటు చేశారు. మాదకద్రవ్య వినియోగ సమస్యలను గుర్తించడం, స్క్రీనింగ్, కౌన్సెలింగ్, చికిత్స, పునరావాసం, విడుదల అనంతరం సమాజంలో పునరేకీకరణకు సహకారం అందించడం వంటి సేవలను కేంద్రాలు అందిస్తున్నాయి.

**అంతర్జాతీయ వేదికపైనా గుర్తింపు**

నివృత్తి కార్యక్రమం ప్రభావాన్ని ఏపీసీఏ, వెల్లూరు నిర్వహించిన అధ్యయనం ద్వారా అంచనా వేశారు. అధ్యయన ఫలితాలను న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌లో జరిగిన అంతర్జాతీయ కరెక్షన్స్ పరిశోధన సదస్సు-2026లో ప్రదర్శించారు. దీంతో తెలంగాణ జైళ్ల శాఖ పునరావాస విధానానికి అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు లభించింది.

అవార్డు రావడం జైళ్ల శాఖ అధికారులు, సిబ్బంది చేస్తున్న కృషికి గుర్తింపుగా డీజీ డా. సౌమ్య మిశ్రా పేర్కొన్నారు. ఖైదీలు వ్యసనాన్ని అధిగమించి ఆత్మ విశ్వాసాన్ని తిరిగి పొందేందుకు నివృత్తి కార్యక్రమం దోహదపడుతోందన్నారు. జైలు నుంచి విడుదలైన తర్వాత కూడా ఆఫ్టర్‌కేర్, సామాజిక పునరేకీకరణ కొనసాగాల్సిన అవసరం ఉందని తెలిపారు. 'కస్టడీ విత్ కేర్', 'ట్రాన్స్‌ఫార్మింగ్ లైవ్స్' అనే శాఖ దృక్పథానికి అనుగుణంగా మానవీయ, శాస్త్రీయ ఆధారిత పునరావాస విధానాలను బలోపేతం చేయడంలో ఈ పురస్కారం గుర్తింపుగా నిలిచిందని శాఖ తెలిపింది.

# ఏవియేషన్ హబ్‌గా కర్నూలు..



- **రాష్ట్రాన్ని ఏవియేషన్ హబ్‌గా తీర్చిదిద్దడమే సీఎం లక్ష్యం**
- **కర్నూలును ఏవియేషన్, డ్రోన్, పారిశ్రామిక రంగాల కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నాం**
- **ఎఫ్‌టీఓల సంఖ్యను పెంచి యువతకు శిక్షణ, ఉపాధి అవకాశాలు**
- **నైట్ ల్యాండింగ్‌పై చర్యలు**
- **కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు**

కర్నూలు, మహా : ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే కీలక ఏవియేషన్ హబ్‌గా అభివృద్ధి చేయాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. కర్నూలు జిల్లాను ఏవియేషన్, డ్రోన్, పారిశ్రామిక రంగాలకు కీలక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. కర్నూలును దేశంలోని బలమైన ఏవియేషన్ హబ్‌లలో ఒకటిగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కర్నూలు ఎయిర్‌పోర్టులో శనివారం ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీ (ఎఫ్‌టీఓ)ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో తొలి ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌టీఓ) కర్నూలులో ఏర్పాటు కావడం ప్రత్యేక పరిణామమన్నారు. కేవలం విమానాశ్రయాల నిర్మాణానికే పరిమితం కాకుండా శిక్షణ, విమానాల నిర్వహణ, గ్రౌండ్ ఆపరేషన్స్, ఎయిర్‌పోర్టు మేనేజ్‌మెంట్ తదితర విభాగాలతో సమగ్ర ఏవియేషన్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. 2014లో దేశంలో 74 విమానాశ్రయాలు ఉండగా ప్రస్తుతం సుమారు 166 విమానాశ్రయాలకు చేరుకున్నాయని మంత్రి తెలిపారు. విమానాశ్రయాలతో పాటు విమానాలు, ప్రయాణికుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందన్నారు. విస్తరిస్తున్న విమానయాన రంగానికి అవసరమైన మానవ వనరులను సిద్ధం చేయడంలో ఎఫ్‌టీఓల పాత్ర కీలకమన్నారు. ప్రస్తుతం దేశంలో సుమారు 36 ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్లు ఉన్నాయని, భవిష్యత్ అవసరాలకు ఈ సంఖ్య సరిపోదన్నారు. దేశంలో విమానాల ఆర్డర్లు సుమారు 1,600కు చేరుకున్న నేపథ్యంలో రానున్న 10-15 ఏళ్లలో 25 వేల నుంచి 30 వేల మంది పైలట్లు అవసరమయ్యే అవకాశం ఉందన్నారు. యువతకు దేశంలోనే అంతర్జాతీయ ప్రమాణాలతో పైలట్ శిక్షణ అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌టీఓలను విస్తరిస్తోందని చెప్పారు.తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు సమీపంలో ఉండటం, ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న విమానాశ్రయం అందుబాటులో ఉండటం కర్నూలుకు ప్రత్యేక ప్రయోజనమని మంత్రి పేర్కొన్నారు. ఏడాది పొడవునా అనుకూల వాతావరణ పరిస్థితులు ఉండటం పైలట్ శిక్షణకు అనువుగా ఉంటుందన్నారు. ప్రస్తుతం కర్నూలు ఎఫ్‌టీఓలో మూడు శిక్షణ విమానాలు ఉన్నాయని, వీటి సంఖ్యను త్వరలో 10కు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఎఫ్‌టీఓ ద్వారా ఏడాదికి 60 మంది వరకు శిక్షణ పొందే సామర్థ్యం ఏర్పడుతుందన్నారు. విమానాల నిర్వహణ, గ్రౌండ్ ఆపరేషన్స్, ఎయిర్‌పోర్టు మేనేజ్‌మెంట్ తదితర రంగాల్లోనూ ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు.

**డ్రోన్ సిటీకి ప్రత్యేక ప్రాధాన్యం**

కర్నూలులో ఏర్పాటు చేస్తున్న డ్రోన్ సిటీ గురించి మాట్లాడుతూ.. భవిష్యత్తులో డ్రోన్ల వినియోగం రక్షణ, వ్యవసాయం, వాణిజ్యం, శాంతిభద్రతలు, భూ సర్వేలు, గ్రౌండ్ సర్వైలెన్స్ తదితర రంగాల్లో మరింత విస్తరించనుందని తెలిపారు. డ్రోన్ల నాణ్యతా పరీక్షలు, ధ్రువీకరణ వంటి కార్యకలాపాలను కర్నూలులోనే నిర్వహించేలా ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. విమానయాన, డ్రోన్ కార్యకలాపాలను ఢిల్లీకి మాత్రమే పరిమితం చేయకుండా ప్రాంతీయంగా వికేంద్రీకరించాల్సిన అవసరం ఉందన్నారు. దేశవ్యాప్తంగా ఇటీవల 11 ఎఫ్‌టీఓలకు అనుమతులు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. కర్నూలులో మరో ఎఫ్‌టీఓతో పాటు కడపలో రెండు ఎఫ్‌టీఓలకు అనుమతులు ఇచ్చామని, రాజమండ్రిలోనూ ఎఫ్‌టీఓలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. భోగాపురం కూడా ఎఫ్‌టీఓలకు అనుకూల ప్రాంతంగా అభివృద్ధి చెందుతోందన్నారు. కర్నూలు, కడప తదితర ప్రాంతాల్లో ఎఫ్‌టీఓలు ఏర్పాటవడంతో రాష్ట్రంలో క్లస్టర్ ఎకోసిస్టమ్ అభివృద్ధి చెందుతుందని తెలిపారు. శిక్షణ విమానాలు, పైలట్లు, ట్రైనర్ల అనుభవాలను పరస్పరం పంచుకునే అవకాశం ఏర్పడి శిక్షణ ప్రమాణాలు మెరుగుపడతాయని చెప్పారు.

ఎఫ్‌టీఓల నిర్వహణ, శిక్షణ నాణ్యత, సౌకర్యాలను మెరుగుపరిచేందుకు ర్యాంకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టామని మంత్రి తెలిపారు. తొలి ర్యాంకింగ్‌లో ఒక ఎఫ్‌టీఓ మాత్రమే 'ఏ' గ్రేడ్ సాధించగా, ప్రస్తుతం 13 ఎఫ్‌టీఓలు 'ఏ' గ్రేడ్, ఒక ఎఫ్‌టీఓ 'ఏ ప్లస్' గ్రేడ్ సాధించాయని వివరించారు. కర్నూలులోని ఎఫ్‌టీఓలు ప్రారంభం నుంచే ఉన్నత ప్రమాణాలను లక్ష్యంగా చేసుకుని పనిచేయాలని సూచించారు.

**హన్సా ఎన్‌జీపై దృష్టి**

దేశీయంగా తయారవుతున్న 'హన్సా ఎన్‌జీ' ఆధునిక ట్రైనర్ విమానాన్ని పైలట్ శిక్షణలో వినియోగించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. ఆధునిక శిక్షణ విమానాలను ఎఫ్‌టీఓలు, విద్యార్థి పైలట్లు వినియోగించేలా అవసరమైన సహకారం అందించే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. విమానాశ్రయాలు, ఎఫ్‌టీఓలు, ఏవియేషన్ యూనివర్సిటీలు, డ్రోన్ సిటీ, అనుబంధ పరిశ్రమలను సమన్వయంతో అభివృద్ధి చేయడం ద్వారా కర్నూలును సమగ్ర ఏవియేషన్ ఎకోసిస్టమ్‌కు కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు సాగుతున్నాయని రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు.

**కర్నూలు విమానాశ్రయానికి నైట్ ల్యాండింగ్**

కర్నూలు విమానాశ్రయంలో విమాన సర్వీసుల సంఖ్య, సమయాలు, కనెక్టివిటీ పెంపుపై ప్రత్యేక దృష్టి సారిస్తామని కేంద్ర మంత్రి తెలిపారు. మరిన్ని విమాన సర్వీసుల కోసం విమానయాన సంస్థలతో చర్చిస్తామని వెల్లడించారు. కర్నూలు విమానాశ్రయంలో నైట్ ల్యాండింగ్ సదుపాయం కల్పించే అంశంపైనా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ విషయాన్ని ఎంపీ బస్తీపాటి నాగరాజు ఢిల్లీలో పలుమార్లు తన దృష్టికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ద్వారా అవసరమైన చర్యలు చేపట్టి నైట్ ల్యాండింగ్ సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సదుపాయం అందుబాటులోకి వస్తే విమానాశ్రయ కార్యకలాపాల సమయం పెరిగి, కర్నూలుకు అదనపు విమాన కనెక్టివిటీకి అవకాశం ఏర్పడుతుందని మంత్రి వివరించారు.

**2047 నాయికి 350కి పైగా విమానాశ్రయాల లక్ష్యం**

రాబోయే పదేళ్లలో దేశంలో మరో 100 విమానాశ్రయాలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. 2047 నాటికి దేశంలో 350కి పైగా విమానాశ్రయాలు ఉండేలా విమానయాన మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. భోగాపురం విమానాశ్రయాన్ని ప్రపంచస్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నామని, విజయవాడ, కడప, రాజమండ్రి విమానాశ్రయాల్లో కొత్త టెర్మినల్ భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టామని తెలిపారు. కుప్పం, నెల్లూరు, శ్రీకాకుళం, అమరావతి, నాగార్జున సాగర్ ప్రాంతాల్లో కొత్త విమానాశ్రయాల ఏర్పాటుపైనా చర్యలు కొనసాగుతున్నాయన్నారు. భోగాపురంలో 139 ఎకరాల్లో ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

## పీఆర్సీని దసరాలోపు ప్రకటించాలి

**డీఏల ఉత్తర్వులు వెంటనే ఇవ్వాలి: జి. దేవీ ప్రసాద్**

**కుషాయిగూడ, మహా :** ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కార్పొరేషన్ మాజీ చైర్మన్ జి. దేవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 30తో పీఆర్సీ గడువు ముగియనున్నందున దసరాలోపు కొత్త పీఆర్సీని ప్రకటించాలని కోరారు. పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించుకుని నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రభుత్వం రెండు డీఏలు మాత్రమే ఇస్తామని ప్రకటించిందని, మిగిలిన డీఏలు ఎప్పుడు ఇస్తారనే దానిపై స్పష్టత లేదన్నారు. డీఏలకు సంబంధించిన ఉత్తర్వులను తక్షణమే జారీ చేయాలని కోరారు. పీఆర్సీ గడువును ప్రభుత్వం పొడిగిస్తే ఉద్యోగులు ఆందోళనకు దిగాల్సిన పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు.

**సీపీఎస్‌పై హామీ అమలు చేయాలి**

సీపీఎస్‌ను రద్దు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు అధ్యయన కమిటీ ఏర్పాటు చేస్తామని చెప్పడం సరికాదన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా మేనిఫెస్టో పేరుతో ప్రజలను మోసం చేయొద్దని అన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.

**ఆరోగ్య కార్డులతో ఇబ్బందులు**

ఉద్యోగుల ఆరోగ్య కార్డులను పలు ఆసుపత్రులు పరిగణనలోకి తీసుకోవడం లేదని దేవీ ప్రసాద్ తెలిపారు. వెల్‌నెస్ సెంటర్లకు ఓపీ సేవలు అప్పగించినా అవసరమైన సిబ్బంది, మందులు, రోగ నిర్ధారణ పరీక్షల కోసం ప్రయోగశాలలు ఏర్పాటు చేయలేదన్నారు. ఓపీ సేవలను కేవలం నిమ్స్‌కే పరిమితం చేయడం వల్ల ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.డీఏలు, టీఏలు, సరెండర్ లీవ్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రాన్ ఖాతాల్లోని సుమారు రూ.10 వేల కోట్లపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. ఉద్యోగులు కొత్తగా ఏమీ కోరడం లేదని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాత్రమే అడుగుతున్నారని తెలిపారు.సమావేశంలో ఎస్టీఎఫ్ మాజీ అధ్యక్షుడు భుజంగరావు, టీజీపీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్ పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ఫ్రంటల్ ఆర్గనైజేషన్స్ కోఆర్డినేటర్‌గా డేరా కృష్ణారెడ్డి

**ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల కోఆర్డినేటర్‌గా ఇచ్చోడ మండలం బోరిగాం గ్రామానికి చెందిన డేరా కృష్ణారెడ్డిని నియమించినట్లు డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ తెలిపారు. ఏఐసీసీ, టీపీసీసీ సూచనల మేరకు ఈ నియామకాన్ని చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాలను సమన్వయం చేస్తూ, పార్టీ కార్యక్రమాలను మరింత చురుగ్గా నిర్వహించేందుకు కృష్ణారెడ్డికి ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.

## ధ్యప్రాచ్యంలో ముదురుతున్న ఉద్రిక్తతలు

**ఇరాన్ ఏడు రోజుల శాంతి ప్రతిపాదనను తోసిపుచ్చిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్.**

**ఢిల్లీ, మహా :** మధ్యప్రాచ్యంలో రగులుతున్న యుద్ధానికి ముగింపు పలికే దిశగా ఇరాన్ చేసిన అత్యంత కీలకమైన ఏడు రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదనను అగ్రరాజ్యం అమెరికా తిరస్కరించినట్లు తెలుస్తోంది. ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిని ఏడు రోజుల్లో తిరిగి తెరవడంతో పాటు, అణ్వాయుధ ఒప్పందంపై మళ్లీ చర్చలు ప్రారంభించేందుకు సిద్ధమని ఇరాన్ ఈ ప్రతిపాదనలో పేర్కొంది. అయితే, ఈ ఆఫర్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తోసిపుచ్చినట్లు 'వాల్ స్ట్రీట్ జర్నల్', 'వాషింగ్టన్ పోస్ట్' పత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి. అంతేకాకుండా, నవంబర్‌లో జరగనున్న అమెరికా మధ్యంతర ఎన్నికల తర్వాత ఇరాన్‌పై మళ్లీ బాంబు దాడులు జరిగే అవకాశం ఉందని ట్రంప్ తన సహాయకులతో ప్రైవేటుగా చెప్పినట్లు ఆ కథనాలు వెల్లడించాయి. ఇరాన్ తన డిమాండ్లను నెరవేరుస్తుందన్న నమ్మకం ట్రంప్‌కు ఏమాత్రం లేకపోవడమే ఈ తిరస్కరణకు ప్రధాన కారణంగా తెలుస్తోంది.ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశాల (UNGA) సందర్భంగా న్యూయార్క్‌లో ఉన్న ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి ఈ ప్రతిపాదన వివరాలను మీడియాకు వెల్లడించారు.

ANN తెలుగు

మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్

27-09-2026

మహా ప్రత్యేకం



# జనంలో కంది శ్రీనన్న



## పరామర్శలు.. ఓదార్పులు

### చెక్కుల పంపిణీ కార్యక్రమాలు.. ఇండ్ల ప్రారంభోత్సవాలు

### జైనథ్, బేల, భోరజ్ మండలాల్లో విస్తృత పర్యటన



**(ఆదిలాబాద్ మహా)**

పరామర్శలు, ఓదార్పులతో ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి నియోజకవర్గాన్ని చుట్టేశారు. జైనథ్, బేల, భోరజ్ మండలాల్లో విస్తృత పర్యటనలు చేశారు. పరామర్శలు, చెక్కుల పంపిణీలు చేయడంతో పాటు స్థానిక సమస్యలపై అధికారులతో మాట్లాడారు. జైనథ్ మండలం కరంజి గ్రామానికి చెందిన జితేందర్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో బాధపడటంతో వారి నివాసానికి వెళ్లి ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి పరామర్శించారు.

**సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన కంది శ్రీనివాస రెడ్డి**

పేద బడుగు బలహీన వర్గాల సంక్షేం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. పేదల వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధినుండి వచ్చిన చెక్కులను ఆయన లబ్దిదారులకు అందించారు. బేలా మండలం భేధొడా గ్రామానికి చెందిన రాజేండ్ల వార్ వనిత గారికి 60 వేల చెక్కును వారి నివాసానకి వెళ్లి చేతికి అందించారు. సీయంఆర్ ఎఫ్ సహాయం కోసం తన క్యాంపు కార్యాలయం లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసామని ఆసుపత్రుల్లో డబ్బుల పెట్టి వైద్యం చేయించుకున్నవారికి ముఖ్య మంత్రి సహాయ నిధినుండి ఆర్థిక సాయంకోసం దరఖాస్తు పెట్టుకోవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..



**మనియార్ పూర్ లో పరామర్శ**

బేలా మండలం మనియర్ పూర్ గ్రామానికి చెందిన వసంత్ భేదోడ్కర్ ఇటీవల అనారోగ్యంతో బాధపడటంతో వారి నివాసానికి వెళ్లి వారిని ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి పరామర్శించారు. .ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. బేలా మండలం భేధొడా గ్రామానికి చెందిన ఈశ్వర్ ధోటె గారి భార్య సులోచన, ఉద్దవ్ భలేరావు, భోడే వార్ పోసాని, రాజేండ్ల వార్ లచ్చన్న, ధోటే దిలీప్ లు ఇటీవల అనారోగ్యంతో బాధపడటంతో వారి నివాసాలకు వెళ్లి కంది శ్రీనివాసరెడ్డి పరామర్శించారు.

**బేలా నుండి భవానీగూడ వెళ్లే రోడ్ మంజూరుచేయిస్తా**

బేలా నుండి భవానీగూడ వెళ్ళే రోడ్ ను మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తో మాట్లాడి త్వరలో మంజూరు చేపించి పనులు మొదలయ్యే విదంగా ప్రయత్నం చేస్తానని ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి స్థానిక ప్రజలకు హామీనిచ్చారు.

**కంది శ్రీనివాస రెడ్డి పరామర్శ**

బేల మండలం పాఠన్ గ్రామానికి చెందిన జాదవ్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందడంతో వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి తెలిపారు.















# పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో శనివారం తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు సిబ్బంది ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ప్రజల హక్కులు భూమి భుక్తి విముక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటాన్ని అధికారులు స్మరించుకున్నారు. భూస్వామ్య దోపిడీ వెట్టి చాకిరీ అన్యాయాలకు వ్యతిరేకంగా ఆమె చూపిన ధైర్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఇ.శ్రీనివాస్ మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ నిర్భయంగా పోరాడారని ఆమె త్యాగాలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. సమాజంలో సమానత్వం న్యాయం ఆత్మగౌరవం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ ఆమె ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఇ. శ్రీనివాస్, డీసీఆర్‌బీ సీఐ రాజు, ఆర్ఐ ఎంటీఓ సుధాకర్, ఆర్ఐ వెల్ఫేర్ కృష్ణారావు, ఆర్ఎస్ఐ ఎర్ర నాయుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సింగరేణిలో.. ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి..

**ఐలమ్మ జీవితం నేటి తరానికి స్ఫూర్తి : ఏరియా జీఎం దుర్గం రామచందర్**



**మణుగూరు, మహా:** వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను శనివారం మణుగూరులో వివిధ సంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సింగరేణి మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంతో పాటు సీపీఐ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో ఐలమ్మ చిత్రపటం, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఐలమ్మ ధైర్యసాహసాలు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం సాగించిన పోరాటాన్ని ఈ సందర్భంగా వక్తలు స్మరించుకున్నారు.

**సింగరేణి జీఎం కార్యాలయంలో ఘన నివాళి**

సింగరేణి మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ తెలంగాణ చరిత్రలో ధైర్యం, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, మహిళా సాధికారతకు ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. అన్యాయాలకు భయపడకుండా తన హక్కుల కోసం పోరాడిన ఆమె జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఆమె చూపిన పోరాట పటిమ ప్రజల్లో హక్కులపై చైతన్యాన్ని పెంపొందించిందన్నారు. ఐలమ్మ జీవితంలోని ధైర్యం, పట్టుదల, ఆత్మగౌరవం, సామాజిక బాధ్యత వంటి విలువలను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పిస్తూ వారి ప్రతిభను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. సింగరేణి అభివృద్ధిలో ప్రతి ఉద్యోగి భాగస్వామిగా ఉంటూ క్రమశిక్షణ, భద్రత, అంకితభావం, సామాజిక బాధ్యతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం డి.వెంకట రామారావు, ఏజీఎం (ఐఈడీ) సీహెచ్.రాంబాబు, ఏజీఎం (పర్సనల్) ఎస్.రమేశ్, ఏరియా ఇంజినీర్ వి.మదన్ నాయక్, డీజీఎం (సివిల్) జి.శివప్రసాద్, ఫైనాన్స్ మేనేజర్ పి.రమేశ్, ఏరియా సెక్యూరిటీ అధికారి కె.శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ అధికారులు కె.శ్రీనివాస్, వి.రామేశ్వరరావు, పీఏ టు జీఎం ఆర్.రాంబాబు, జీఎం కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

**సీపీఐ ఆధ్వర్యంలో..**

సీపీఐ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను మణుగూరులో ఘనంగా నిర్వహించారు. ముందుగా సంతోష్‌నగర్‌లోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐలమ్మ ఆశయాలను కొనసాగిస్తామని పేర్కొంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుగ్యాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు మాట్లాడుతూ అన్యాయం, భూస్వామ్య దోపిడీ, వెట్టి చాకిరికి వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. భూమి, భుక్తి, హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆమె చూపిన ధైర్యాన్ని భావితరాలు ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఐలమ్మ పోరాట చరిత్రను యువతకు తెలియజేసేలా మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోందే కుటుంబరావు, మహిళా సమాఖ్య మండల కార్యదర్శి కోడిమెల్ల సుజాత, ఏఐటీయూసీ మండల కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, కార్యవర్గ సభ్యుడు ఆధార్ల రాములు, ఏఐటీయూసీ నాయకులు బోశెట్టి సంపత్, రంగు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



# పిల్లలతో తల్లుల ఆటల సందడి

**మిరాకిల్ మైండ్స్‌లో 'లిటిల్ స్టార్స్–సూపర్ మామ్స్' కార్యక్రమం**

**సత్తుపల్లి, మహా :** పిల్లలలో ఉల్లాసంతో పాటు తల్లిదండ్రులతో ఆత్మీయ అనుబంధాన్ని పెంపొందించేలా సత్తుపల్లి సిద్ధారం రోడ్డులోని మిరాకిల్ మైండ్స్-ది స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో శనివారం 'లిటిల్ స్టార్స్-సూపర్ మామ్స్ విత్ మిరాకిల్ టీచర్స్' కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా నిర్వహించారు. 200 మందికిపైగా తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి పాల్గొని ఆటలతో సందడి చేశారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులకు బంగాళాదుంపల పరుగు, బంతుల సేకరణ, బెలూన్ ఆటలు తదితర వినోదాత్మక పోటీలు నిర్వహించారు. చిన్నారులు, తల్లిదండ్రులు కలిసి ఆటల్లో పాల్గొనడంతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. ఆటల ద్వారా పిల్లల్లో సమన్వయం, చురుకుదనం, ఆత్మవిశ్వాసం పెంపొందడంతో పాటు తల్లిదండ్రులతో వారి అనుబంధం మరింత బలపడేలా కార్యక్రమాన్ని రూపొందించారు. కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ, పిల్లలతో కలిసి గడిపే ఇలాంటి ఆహ్లాదకర కార్యక్రమాలను భవిష్యత్తులోనూ నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రత్నాకర్ మాట్లాడుతూ.. పిల్లల మానసిక, శారీరక వికాసంతో పాటు తల్లిదండ్రులతో సాన్నిహిత్యాన్ని పెంపొందించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

# చాకలి ఐలమ్మ సేవలు చిరస్మరణీయం

- సింగరేణి డైరెక్టర్ సూర్యనారాయణ
- సింగరేణి హెడ్ ఆఫీస్‌లో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** చాకలి ఐలమ్మ సేవలు చిరస్మరణీయమని సింగరేణి డైరెక్టర్ ఎల్ వి సూర్యనారాయణ అన్నారు. సింగరేణి ప్రధాన కార్యాలయంలోని హెచ్ఆర్‌డి కాన్ఫరెన్స్ హాల్ నందు శనివారం వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను నిర్వహించడం జరిగింది. జిఎం (పర్సనల్) వెల్ఫేర్ సిఎస్ఆర్ అండ్ సెక్యూరిటీ కే.అజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ హాజరయ్యారు. ముందుగా చాకలి ఐలమ్మ చిత్ర పటానికి డైరెక్టర్ ఎల్.వి.సూర్యనారాయణతో పాటు యూనియన్ నాయకులు శాఖాధిపతులు అధికారులు ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం డైరెక్టర్ ఎల్.వి.సూర్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తెలంగాణ రైతాంగ ఉద్యమంలో ధైర్యసాహసాలతో పోరాడిన వీరనారి తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు ఆత్మగౌరవానికి ప్రతీక అయిన చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలను ఇక్కడ ఇంత ఘనంగా జరుపుకోవటం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్పొరేట్ లో మాత్రమే కాకుండా సింగరేణి వ్యాప్తంగా ఈ జన్మదిన వేడుకలను జరుపుకుంటున్నామని తెలిపారు. చాకలి ఐలమ్మ అణచివేత భూస్వామ్య దోపిడీకి వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా భూమి భుక్తి హక్కులకోసం ధైర్యంగా నిలిచి పేదలు రైతులు మహిళలకు స్ఫూర్తిగా నిలిచిన ఐలమ్మ జీవితం చిరస్మరణీయం అని తెలిపారు. చాకలి ఐలమ్మ జయంతి వేడుకల ద్వారా ఆమె ధైర్య సాహసాలను చేసిన సేవలను స్ఫూర్తిగా తీసుకొని సమాజంలో జరిగే అన్యాయాలను ఎదురించి నిలబడాలని తెలిపారు. జిఎం (పర్సనల్) వెల్ఫేర్ అజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డైరక్టర్ ఎల్.వి.సూర్యనారాయణతో పాటు జనరల్ మేనేజర్ (సిపి అండ్ పి)ఏ.మనోహర్, ఏఐటియూసి నాయకులు ఎస్.రాము, ఐఎన్‌టియూసి నాయకులు ఎస్.పితాంబర రావు, సిఎంఓఏఐ ఉపాధ్యక్షుడు కేశవరావు, జిఎం (సిహెచ్‌పి) పి.ఎలిషా, జిఎం (పర్సనల్) ఐఆర్ అండ్ పిఎం జి.వి.కిరణ్ కుమార్, జిఎం (పర్సనల్) ఈఈ అండ్ ఆర్‌సి ఏజీఎం మురళీధర రావు, జిఎం (ఈ అండ్ ఎం) వర్క్ షాప్ అండ్ ఎనర్జీ మేనేజ్‌మెంట్) కె.శ్రీనివాసులు, జిఎం (బిడి) బి.రామదాసు, డిజిఎం (పర్సనల్)లు బి.శివ కేశవరావు, ముకుంద సత్యనారాయణ, కార్పొరేట్ లోని వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు, అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఐలమ్మ పోరాటమే.. నేటి ఉద్యమాలకు స్ఫూర్తి

**సత్తుపల్లి, సెప్టెంబరు 26: మహా :** భూస్వాములపై పేదల హక్కుల కోసం చాకలి ఐలమ్మ సాగించిన వీరోచిత పోరాట స్ఫూర్తితో నేటి ప్రజా సమస్యలపై ఐక్యంగా ఉద్యమించాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని సీపీఐ(ఎం) సత్తుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం ప్రజాసంఘాల కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ భూస్వామ్య దోపిడీకి ఎదురొడ్డి పేదలు, రైతులు, కూలీల హక్కుల కోసం ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ ప్రజలకు నేటికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఐలమ్మ ఉద్యమం ఒక వ్యక్తి కోసం సాగిన పోరాటం కాదని, అణగారిన వర్గాల ఆత్మగౌరవం, భూమి, జీవన హక్కుల కోసం సాగిన ప్రజా పోరాటమని పేర్కొన్నారు. మహిళలు సైతం సామాజిక అన్యాయాన్ని ధైర్యంగా ఎదురించి హక్కుల కోసం ఉద్యమించాలని ఆమె జీవితం చాటిచెప్పిందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పేదలు ఇళ్ల స్థలాలు, ఉపాధి, సాగుభూమి, పింఛన్లు తదితర సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం ప్రజలను సమీకరించి నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు కువ్వారపు లక్ష్మణరావు, బండి వేలాద్రి, కావూరి వెంకటేశ్వరరావు, రాములు, రామకృష్ణ, ఆంజనేయులు, బాలస్వామి, రాము, లక్ష్మి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీతో బంగారు బాల్యం

- పోషణతోపాటు విద్య.. మంచి అలవాట్లు, కథలు, పూర్వ గణిత భావనలపై చిన్నారులకు శిక్షణ



**సత్తుపల్లి, సెప్టెంబరు 26:మహా :** చిన్నారులకు బాల్యారంభ సంరక్షణ, విద్య అందించడమే అంగన్వాడీ కేంద్రాల ప్రధాన లక్ష్యమని ఐసీడీఎస్ చింతకాని సెక్టార్ సూపర్‌వైజర్ సంధ్యారాణి అన్నారు. చింతకాని మండలంలోని నాగిలిగొండ-1, నాగిలిగొండ-2 అంగన్వాడీ కేంద్రాల్లో 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోషకాహారం అందించడంతోపాటు ఆటపాటల ద్వారా వారి నైపుణ్యాలను పెంపొందించేలా విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల చిన్నారులకు ఆటలు, పాటలు, మంచి అలవాట్లు, సంభాషణ, కథలు, శాస్త్రీయ పరిజ్ఞానం, సాంస్కృతిక కార్యక్రమాలు, పూర్వ గణిత భావనలు, సృజనాత్మకత వంటి అంశాలను బోధిస్తున్నట్లు వివరించారు. చిన్నారులు నేర్చుకున్న అంశాలను తల్లుల సమక్షంలో ప్రదర్శింపజేసి.. వారి అభివృద్ధి, ప్రతిభా పాటవాలను తల్లిదండ్రులు స్వయంగా తెలుసుకునేలా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు అలివేలుమంగ, లేయమ్మ, ఆయా నాగమణి తదితరులు పాల్గొన్నారు.



# మణుగూరులో.. ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ జయంతి

- ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం - వక్తలు

**మణుగూరు, మహా :** తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు శనివారం మణుగూరులో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు పట్టణంలోని హనుమాన్ జంక్షన్ వద్ద రజక సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో ఐలమ్మ చిత్రపటం, విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. నిజాం పాలన, రజాకార్ల అరాచకాలు, భూస్వామ్య వెట్టిచాకిరికి వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటాన్ని వక్తలు ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

**ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘన నివాళి**

మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చిన్నప్పయ్య మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు, పోరాట పటిమ చిరస్మరణీయమన్నారు. అన్యాయాన్ని ఎదిరిస్తూ ఆమె సాగించిన ఉద్యమం తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకుందని పేర్కొన్నారు. భూమి, భుక్తి, సామాజిక గౌరవం కోసం ఆమె చేసిన పోరాటం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. విద్యార్థులు ఐలమ్మ జీవిత చరిత్ర, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని ఐలమ్మకు నివాళులర్పించారు.

**హనుమాన్ జంక్షన్‌లో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు**

మణుగూరులోని హనుమాన్ జంక్షన్ వద్ద ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి మణుగూరు రజక కుల బాంధవులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాటి నిజాం పాలనలో రజాకార్ల అరాచకాలను, భూస్వామ్య వెట్టిచాకిరిని ధైర్యంగా ఎదుర్కొన్న వీర వనిత ఐలమ్మ అని వక్తలు కొనియాడారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం ఐలమ్మ చేసిన పోరాటాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయని పేర్కొన్నారు. అన్యాయాన్ని ఎదుర్కొనే విషయంలో మహిళా శక్తిని చాటి చెప్పిన ధీరవనిత ఆమె అని అన్నారు. ఐలమ్మ ఆశయాలు, పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మణుగూరు మండల రజక సంఘ నాయకులు, రజక కుల బాంధవులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తు కోసమే అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వ్యవస్థ

- విద్యార్థుల అభివృద్ధికి నిరంతర కృషి
- జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ భాను ధర్మానాయక్



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** విద్యార్థుల భవిష్యత్తు కోసమే అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వ్యవస్థ విజయవంతంగా ముందుకు వెళ్తుందని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ భాను ధర్మానాయక్ స్పష్టం చేశారు. కొత్తగూడెంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ అటానమస్ కళాశాలలో శనివారం అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో కోఆర్డినేటర్లు, కౌన్సిలర్స్ తో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడంతో పాటు నైపుణ్యాభివృద్ధి ఉపాధి అవకాశాలు ఆర్థిక స్వావలంబన కల్పించే లక్ష్యంతో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పలు నూతన కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. యూనివర్సిటీ ద్వారా రాశి సహకారంతో స్టైపెండ్‌తో కూడిన అప్రెంటిస్‌షిప్ వి హబ్ ద్వారా మహిళా సాధికారత టిసిఎస్ ఐకాన్ ద్వారా ఉద్యోగ నైపుణ్య శిక్షణ నిపుణ ఫెలోషిప్ సమతా సహాయ పథకంవంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా గ్రామీణ గిరిజన యువతకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ అందిస్తూ వారిని ఉపాధి స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యతో పాటు ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం ఎంతో ముఖ్యమని విద్యార్థులు యూనివర్సిటీ అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. విద్యతో పాటు నైపుణ్యం ఉపాధితో ఆర్థిక స్వావలంబన అనే లక్ష్యంతో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నిరంతరం కృషి చేస్తోందని ప్రొఫెసర్ బానోత్ ధర్మానాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రెడ్యా నాయక్, కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పోలారపు పద్మ, ఖమ్మం రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ గుగులోత్ వీరన్న, డాక్టర్ పూర్ణచంద్రరావు, పాల్వంచ డిగ్రీ కళాశాల కోఆర్డినేటర్ పారెల్లి శ్రీనివాస్, కొత్తగూడెం కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, దివ్య, రాందాసు ఇతర కౌన్సిలర్స్ పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు పంపిణీ



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** కొత్తగూడెం ప్రగతి మైదానంలో నాక్ సంస్థ ద్వారా గత 15 రోజులుగా టైలరింగ్ తాపీ మేస్త్రీలుగా శిక్షణ పొందిన మహిళలు పురుషులకు ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన సర్టిఫికెట్లను శనివారం అందజేశారు. ఈ కార్యక్రమానికి పీఎం విశ్వకర్మ యోజన జిల్లా కోఆర్డినేటర్ ఆకుల నాగేశ్వరరావు గౌడ్ పాల్గొని తన చేతుల మీదుగా శిక్షణ పూర్తి చేసిన మహిళలకు పురుషులకు సర్టిఫికెట్లను ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆకుల నాగేశ్వరరావు గౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళలకు స్వయం ఉపాధి కింద అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ఆర్థికంగా ఎదిగేందుకు పీఎం విశ్వకర్మ యోజన ద్వారా చేతి వృత్తుల వారికి దేశంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా స్కీమును ఏర్పాటు చేయడం జరిగిందని బడుగు బలహీన వర్గాలను ఆర్థికంగా చేయుత ఇవ్వటం కోసం కేంద్ర ప్రభుత్వం చేతి వృత్తుల వారిని గుర్తించి ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను ఇస్తుందని తెలిపారు. నరేంద్ర మోడీ సారథ్యంలో దేశంలో ఏ ఒక్కళ్ళు పేదవాడు అని లేకుండా అన్ని వర్గాలను గుర్తించిన ఏకైక ప్రభుత్వం నరేంద్ర మోడీ వల్లనే సాధ్యపడిందన్నారు. ఈ కార్యక్రమంలో నాక్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట్ రాజు, బేబీ శిక్షణ పూర్తి చేసిన మహిళలు పాల్గొన్నారు.

# రేషన్ కార్డులకు స్మార్ట్ హంగులు

- రేషన్ కార్డు కేవలం సరుకుల కోసం కాదు.. సంక్షేమానికి కీలక ఆధారం
- అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ ప్రయోజనాలు చేరేలా చర్యలు: ఎమ్మెల్యే రాగమయి



**సత్తుపల్లి, మహా :** పేద, బలహీన వర్గాల కుటుంబాలకు ఆహార భద్రతతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడంలో రేషన్ కార్డు కీలకమని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. రేషన్ కార్డు కేవలం నిత్యావసర సరుకులు పొందే పత్రం కాదని, పలు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలకు ఆధారంగా నిలుస్తుందని తెలిపారు. సత్తుపల్లి మండలం రేజర్ల, రామగోవిందాపురం గ్రామాల్లో శనివారం నూతన స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సాంకేతికతను జోడించిన స్మార్ట్ కార్డులతో అర్హులైన కుటుంబాలను గుర్తించడం, వారికి ప్రభుత్వ సేవలు చేరవేయడం మరింత సులభతరం అవుతుందని వివరించారు. పేద కుటుంబాలపై నిత్యావసరాల భారం తగ్గించేందుకు రేషన్ వ్యవస్థతో ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఆహార భద్రత కల్పించడంతో పాటు సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రభుత్వ సేవలను మరింత పారదర్శకంగా అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఈ సందర్భంగా పేదల కుటుంబాలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల్లో ప్రజలను కలుసుకున్న ఎమ్మెల్యే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్డులు అందుకున్న లబ్ధిదారుల అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, తహసీల్దార్, ఎంపీడీవో, రేజర్ల సర్పంచ్ భీమిరెడ్డి అరుణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, రామగోవిందాపురం సర్పంచ్ మౌనిక నరేంద్రరెడ్డి, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, గ్రామస్థులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# బాలిక సదనంలో మేజిస్ట్రేట్ ఆకస్మిక తనిఖీ..

- చిన్నారుల సమస్యలు, సౌకర్యాలపై ఆరా
- చదువుతోనే ఉన్నత భవిష్యత్తు..
- మెజిస్ట్రేట్ కంబపు సూరి రెడ్డి



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండల న్యాయ సేవా కమిటీ ఛైర్మన్, ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కంబపు సూరి రెడ్డి శనివారం మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురం బాలిక సదనం (చిల్డ్రన్ హోం)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సదనంలోని గదులు, వంటగది, ఆవరణతో పాటు పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత, వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. సదనంలోని చిన్నారులతో మేజిస్ట్రేట్ కొద్దిసేపు ముచ్చటించి వారికి ఏమైనా సమస్యలు ఉన్నాయా, భోజనం, వైద్యం, విద్య, ఇతర సౌకర్యాలు సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పిల్లల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీసిన ఆయన, అవసరమైన వైద్య పరీక్షలు సకాలంలో నిర్వహించాలని సదనం నిర్వాహకులకు సూచించారు. చిన్నారులు చదువుపై శ్రద్ధ పెట్టి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, జీవితంలో ఎదురయ్యే ఇబ్బందులకు భయపడకుండా ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని సూచించారు. ఏదైనా సమస్య ఎదురైతే నిర్వాహకులు, సంబంధిత అధికారులు లేదా న్యాయ సేవా సంస్థల దృష్టికి తీసుకురావాలని, పిల్లల హక్కుల పరిరక్షణకు న్యాయ సేవా సంస్థలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని తెలిపారు. సదనం నిర్వాహకులతో మాట్లాడుతూ పిల్లలకు అందుతున్న ఆహారం, తాగునీరు, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లు, విద్యా సదుపాయాలు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సదనంలో పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణాన్ని కల్పిస్తూ చిన్నారుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం చిన్నారులకు పండ్లను అందజేశారు. సదనంలోని బాలికలకు మేజిస్ట్రేట్ స్వయంగా భోజన పదార్థాలను వడ్డించారు. ఆహార రుచులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సదనం చైల్డ్ వెల్ఫేర్ అధికారిణి దీప్తి రాణి, న్యాయవాది అంకం సర్వేశ్, లీగల్ సెల్ కోఆర్డినేటర్ రవీందర్, సదనం అసిస్టెంట్ కుమారి, కోర్టు కానిస్టేబుల్ బుచ్చిబాబు, హోంగార్డు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# వీరనారి చిట్యాల ఐలమ్మ ఆశయాలను కొనసాగించాలి

**ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి**

**కుషాయిగూడ, మహా :** తెలంగాణ సాయుధ పోరాటంలో ధైర్యసాహసాలతో ప్రజల్లో చైతన్యం రగిలించిన తెలంగాణ వీరనారి చిట్యాల ఐలమ్మ 131వ జయంతి వేడుకలను తెలంగాణ రజక సమితి ఆధ్వర్యంలో శనివారం ఈసీఐఎల్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి పలువురు ప్రముఖులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన ధీరవనిత చిట్యాల ఐలమ్మ అని కొనియాడారు. తెలంగాణ ప్రజల తెగువ, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పుకణికగా ఐలమ్మ నిలిచారన్నారు. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె సాగించిన పోరాటం నేటి తరానికి సైతం స్ఫూర్తిదాయకమన్నారు. చాకలి ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే భే తి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ, సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆమె చేసిన పోరాటాన్ని స్మరించుకోవడంతో పాటు, ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. బిజెపి తెలంగాణ అధికార ప్రతినిధి తాడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, వీర తెలంగాణ విప్లవ సాయుధ పోరాటంలో చిట్యాల ఐలమ్మ ధైర్య సాహసాలు తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరన్నారు. బిఆర్ఎస్ సీనియర్ నేత వంజరి ప్రవీణ్ కరిపే మాట్లాడుతూ చిట్యాల ఐలమ్మ జయంతి ఉత్సవాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం శుభ పరిణామన్నారు. ఆమె స్ఫూర్తితో పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి మాట్లాడుతూ. చిట్యాల ఐలమ్మ నేటి రేపటి భవిష్యత్తాలకు మార్గదర్శమన్నారు. మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో వీరనారి చిట్యాల ఐలమ్మ చరిత్రను మరపురానిదని గుర్తు చేశారు. మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ మాట్లాడుతూ వెట్టి చాకిరి విముక్తి కోసం ఆనాడు భూస్వాములతో పోరాడిన వీర వనిత అని కొనియాడారు.కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, కొల్లూరు అంజయ్య. ప్రభుదాస్. బీఆర్ఎస్ నాయకులు, సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి. కాశం మైపాల్ రెడ్డి మురళి పంతులు బుచ్చన్న గారి శ్రీకాంత్ రెడ్డి సప్పిడి శ్రీనివాస్ రెడ్డి. బిజెపి నేతలు. ఏనుగు సీతారాం రెడ్డి. కుశ బత్తుల విద్యాసాగర్ . అంబాటి వెంకటాచలం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొత్త అంజిరెడ్డి. కృష్ణవేణి..కార్యకర్తలు, రజక సంఘం నాయకులు, సూరంపల్లి నర్సింలు. రత్నాల కనకయ్య. శనిగరం అశోక్ . కుమారస్వామి. షేర్ మరెమ్మ. రహీం. సిపిఐ. సిపిఐ ఎంఎల్ . సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్. ప్రజా సంఘాల నేతలు. కుల సంఘాల నేతలు. ఆయా అక్క కాలనీల సంఘాల నేతలు. విద్యార్థి సంఘాల నేతలు. జర్నలిస్టులు. న్యాయవాదులు. రచయితలు.తదితరులు పాల్గొన్నారు.



# ఎయిడ్స్ నియంత్రణపై టీజీఎస్ఏసీఎస్ ప్రత్యేక దృష్టి

**కుషాయిగూడ, మహా :** మేడ్చల్ -మల్కాజ్‌గిరి జిల్లాలో హెచ్ఐవీ-టీబీ సేవల అమలును తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (టీజీఎస్ఏసీఎస్) అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఎ. రాజేశం సమీక్షించారు. మొబిలైజేషన్ ఫర్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమంలో భాగంగా మల్కాజ్‌గిరి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించి 959599 సూచికల పురోగతిని పరిశీలించారు. ఐసీటీసీలో హెచ్ఐవీ పరీక్షలు, నిర్ధారణ, నెలవారీ పరీక్షల వివరాలు, కొత్తగా గుర్తించిన హెచ్ఐవీ బాధితులను ఏఆర్‌టీ సేవలకు అనుసంధానిస్తున్న తీరును పరిశీలించారు. హెచ్ఐవీ-టీబీ పరస్పర రిఫరల్స్, లబ్ధిదారుల ఫాలోఅప్ వివరాలను సమీక్షించారు. సీబీనాట్ కేంద్రంలో టీబీ రికార్డులు, హెచ్ఐవీ-టీబీ సహవ్యాధి కేసులు, చికిత్స, ఫాలోఅప్ పరిస్థితిని పరిశీలించారు. మేడ్చల్ -మల్కాజ్‌గిరి జిల్లా ఇప్పటికే మొదటి, మూడో 95 సూచికలను సాధించిందని డాక్టర్ రాజేశం తెలిపారు. ప్రస్తుతం రెండో 95 సాధనపై ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు. గుర్తించిన హెచ్ఐవీ బాధితులను ఏఆర్‌టీ సేవలకు అనుసంధానించి, వారు క్రమం తప్పకుండా చికిత్స పొందేలా చూడాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలను జిల్లా బృందం క్రమబద్ధంగా సందర్శించి ఏఆర్‌టీ సేవలు పొందుతున్న వారిని గుర్తించి కార్యక్రమానికి అనుసంధానం చేయాలని సూచించారు. చికిత్స కొనసాగింపు, ఫాలోఅప్, రిఫరల్స్, రికార్డుల నిర్వహణలో మరింత సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రక్తనిధిలో స్వచ్ఛంద రక్తదాన సేకరణ, హెచ్ఐవీ స్క్రీనింగ్ పరిస్థితిని పరిశీలించారు. హెచ్ఐవీ పాజిటివ్‌గా గుర్తించిన వారిని కార్యక్రమానికి అనుసంధానం చేసి తగిన చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ వై. శ్రీదేవి, డాక్టర్ రాధ, డాక్టర్ మాధురి, డాక్టర్ పి. వినోద్, సంజీవ్, రమేష్, కల్పన, బాబు రావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాలు... విజ్ఞానానికి హేతువులు

- అభ్యసనం... కూసువిద్య.
- రెండు డివిజన్ల లో గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలి.
- చంద్రపురి కాలనీ... డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్



**జవహర్ నగర్, మహా :** గ్రంథాలయాలు విజ్ఞానానికి హేతువులని, అభ్యసనం కూసువిద్య అని (ప్రాక్టీస్ మేడ్ ఫర్ఫెక్ట్) చంద్రపురి కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ పేర్కొన్నారు. చంద్రపురి కాలనీ డివిజన్, జవహర్ నగర్ డివిజన్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలని కోరుతూ చంద్రపురి కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, గ్రంథాలయాల చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిలను శనివారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన వజ్రేష్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డిలు వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి గ్రంథాలయ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యాభివృద్ధికి హేతువులని, సమాజ ప్రగతికి దీపికలన్నారు. యువత ముఖ్యంగా గ్రంథాలయాలను ఉపయోగించుకుని ఉన్నత స్థానంలోకి పయనించినప్పుడే సమ సమాజ స్థాపన కు చేరువవుతామన్నారు. జవహర్ నగర్ లో గ్రంథాలయాలు లేక యువత, చదువరులు, పెద్దలు తదితరులు ఇబ్బందులు పడుతున్నారని దీన్ని దృష్టిలో ఉంచుకొని రెండు డివిజన్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేసి చదువరుల అభిమానాన్ని చురగొనాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా, మాజీ కార్పొరేటర్లు గొడుగు వేణు, ఎడ్ల శ్రీనివాసరెడ్డి, బల్లి శ్రీనివాస్ గుప్తా, బింగి సతీష్ గౌడ్, మనోధర్ రెడ్డి, నాయకులు మాట్ల వినయ్, మాధవరెడ్డి, నాయకులు ఎర్రగుడ్ల వెంకటేశ్వర్లు, బుజ్జి, నాయకం భాస్కర్, నర్రా మహేష్, బబ్లూ ముదిరాజ్, గజ్వేల్ శంకర్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయాలే సమాజ ప్రగతికి బాటలు



**కరీంనగర్, మహా :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి అన్నారు. కరీంనగర్ పట్టణంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని శనివారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. 2013లో ఎంపీగా ఉన్న సమయంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా కరీంనగర్ బస్‌స్టేషన్‌కు ఆయన పేరు పెట్టామని, 13 ఏళ్ల తర్వాత అదే ప్రాంగణంలో విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం, సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ జీవితాంతం పోరాడారని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. యువత అంబేద్కర్ జీవితం, ఆలోచనలను అధ్యయనం చేయాలని సూచించారు.మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. అంబేద్కర్ కల్పించిన హక్కులను కాపాడుకుంటూ సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. మనలో మార్పు వచ్చినప్పుడే సమాజంలో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం అంబేద్కర్ ఆశయాలను ఆచరణలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలు!

- నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి మహా :** నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో జిల్లా ఉపాధి శాఖ, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) రీజినల్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబర్ 1న గురువారం పెద్దపల్లిలో భారీ జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. పెద్దపల్లి బస్సు డిపో సమీపంలోని టాస్క్ సెంటర్ ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. జాబ్ డ్రైవ్‌లో ఎల్.ఎన్. గ్రూప్ కంపెనీలో అసెంబ్లీ ఆపరేటర్లు, రేడియంట్ కంపెనీలో రిలేషన్‌షిప్ మేనేజర్లు, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో బ్యాంకింగ్ అసోసియేట్లు, డీమార్ట్‌లో క్యాషియర్లు, ప్రమోటర్లు, నీమ్యాన్స్ సంస్థలో సేల్స్ ప్రమోటర్ల పోస్టులకు ఎంపికలు చేపట్టనున్నట్లు తెలిపారు. వీటితో పాటు డేటా అనలిస్ట్ కోర్సులో ఉచిత శిక్షణతో పాటు ప్లేస్‌మెంట్ అవకాశాలు కూడా కల్పించనున్నట్లు వెల్లడించారు.

# ఎస్జీ టి ఉపాధ్యాయులకు జీవో 25తో ఒత్తిడి పెరుగుతుంది

- ఎస్ జి టి ఉపాధ్యాయ సమస్య లపై ప్రధానోపాధ్యాయులకు వినతిపత్రం అందజేత.
- తపస్, రాజేంద్రనగర్ మండల అధ్యక్షులు బాలకృష్ణ మదగని

**రాజేంద్రనగర్ మహా ;** ఇటీవల విద్యాశాఖ తీసుకొచ్చిన ( జీవో 25) కారణంగా ఎస్‌జీటీ ఉపాధ్యాయులపై తీవ్రమైన ఒత్తిడి పెరుగుతోంది. ఈ జీవో కింద ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు, మల్టీగ్రేడ్ బోధన (ఒకే ఉపాధ్యాయుడు ఒకే సమయంలో ఒకటి కంటే ఎక్కువ తరగతులకు బోధించడం) వంటి నిబంధనల వల్ల పనిభారం రెట్టింపు అయిందని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎస్జీటి ఉపాధ్యాయులు క్లాస్ రూమ్ లలో పాఠాలు చెప్పేకన్నా బోధనేతర పనులు ఎక్కువగా వున్నాయి అవి తగ్గించాలి.ప్రతి క్లాస్ కు ఒక టీచర్ ను ఇవ్వాలి. ఎఫ్ఎల్ఎన్ వల్ల ఉపాధ్యాయులకు మానసికంగా వత్తిడి ఎక్కువ అయ్యింది.జీవో 25 ను సవరించాలి. ప్రతి ప్రాథమిక పాఠశాల కు ఒక ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ పోస్ట్ఇవ్వాలి. ఎస్జీటి ఉపాధ్యాయులకు టీచర్ ఎమ్మెల్సీ ఎలక్షన్స్ లో ఓటు హక్కు కల్పించాలి. జేఏసీ చైర్మన్ మారం జగదీశ్ ఎస్ జీటి లపై చేసిన వాక్యలను మేము తీవ్రంగా ఖండిస్తున్నాం,వెంటనే అయన చేసిన వాక్యాలను వెనక్కి తీసుకోవాలి. తెలంగాణలో దాదాపు 41,000 ఎస్ జీటి లు పని చేస్తున్నారు వారి మనోభావాలను దెబ్బతీసేవిదంగా మాట్లాడడం సబబు కాదు, మీరు మాట్లాడిన మాటలు వెనక్కి తీసుకోవాలి. కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ( తపస్ ) రాజేంద్రనగర్ మండల అధ్యక్షులు బాలకృష్ణ మదగని , మండల అధ్యక్షులు కామిశెట్టి వెంకటయ్య, కాంప్లెక్స్ సెక్రటరీ ఎం,షాలిని, శ్రీనివాస్ రెడ్డి,ఎస్ జీటి ఉపాధ్యాయులు తది తరులు పాల్గొన్నారు.

# పంట నమోదు ఆధారంగానే ప్రభుత్వ కొనుగోళ్లు



**రాజేంద్రనగర్, మహా :** రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో పాటు ఆన్‌లైన్ పంట నమోదు (డిజిటల్ క్రాప్ సర్వే) పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్వేత సూచించారు. రైతు రిజిస్ట్రేషన్ ద్వారా ఒక రైతుకు ఒక గుర్తింపు (ఫార్మర్ ఐడీ) లభిస్తుందని తెలిపారు. పత్తి, వరి, మొక్కజొన్న, కంది తదితర పంటల కొనుగోళ్లు, ఎరువుల కొనుగోలు, పంట రుణాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, ముఖ్యంగా పీఎం కిసాన్ వంటి పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు అవసరమని పేర్కొన్నారు. వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేయడంతో పాటు సబ్సిడీలు, వ్యవసాయ సేవలను సులభతరం చేయడమే దీని ఉద్దేశమన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సెప్టెంబర్ 22 నుంచి 30 వరకు రైతు రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేక క్యాంపెయిన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) లేదా మీ సేవా కేంద్రంలో నమోదు చేసుకోవచ్చన్నారు. ఆధార్ కార్డు, భూమి పాస్‌బుక్, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్ అవసరమని చెప్పారు. శంషాబాద్ మండలంలో 14,709 మంది పట్టాదారు రైతులు ఉండగా ఇప్పటివరకు 7,575 మంది, అంటే 51 శాతం మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఇంకా 7,134 మంది నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు. మండలంలోని 28 రెవెన్యూ గ్రామాల్లో డిజిటల్ క్రాప్ సర్వే కొనసాగుతోందని తెలిపారు. పంట నమోదు ఆధారంగానే ప్రభుత్వం పత్తి, మొక్కజొన్న, కందులు, వడ్లు తదితర పంటలను కొనుగోలు చేస్తుందని శ్వేత వివరించారు. పంట నమోదు సిబ్బంది గ్రామాలకు వచ్చినప్పుడు రైతులు తమ పొలాల వద్ద అందుబాటులో ఉండి సరైన పంట వివరాలు అందించాలని కోరారు.

# ట్యాంక్‌బండ్‌పై లయన్స్ సేవా జలధార

**25 వేల తాగునీటి బాటిళ్ల పంపిణీ**



**కుషాయిగూడ, మహా:** గణేష్ నిమజ్జనం సందర్భంగా ట్యాంక్‌బండ్ వద్ద లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320హెచ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. నిమజ్జనానికి తరలివచ్చిన భక్తులు, ప్రభుత్వ అధికారులు, సేవా సిబ్బంది, కార్మికులు, ప్రజలకు 25 వేల తాగునీటి బాటిళ్లను పంపిణీ చేశారు. లయన్ కోతపల్లి రాంబాబు, పీఎంజేఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాన్ని డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ అశోక్‌కుమార్ స్వైన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవంతుడి సేవలో భక్తులు.. భక్తుల సేవలో లయన్స్ అనే స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. అవసరం ఉన్నచోట లయన్ ఉంటాడనే నినాదానికి ఈ కార్యక్రమం నిదర్శనమన్నారు. పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డి. లింగారెడ్డి మాట్లాడుతూ రాంబాబు చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. గణేష్ పండుగ సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా 2,500 పర్యావరణహిత గణేష్ విగ్రహాలను పంపిణీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు.



# ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ జయంతి

**వలిగొండ సెప్టెంబర్ 26 మహా న్యూస్ :** వలిగొండ మండల కేంద్రంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వలిగొండ పిఎసిఎస్ చైర్మన్ గరిసే రవి చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు సామాజిక న్యాయం ఆత్మగౌరవం కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో. ఎలిమినేటి సత్యనారాయణ పోలేపాక జానకి రాములు మైసొల్ల ప్రవీణ్ మాజీ ఉపసర్పంచ్ మత్స్యగిరి తదితరులు పాల్గొన్నారు.



# రూ.13కే గొర్రెకు బీమా

**కరీంనగర్, మహా :** గొర్రెలు, మేకల పెంపకాన్ని జీవనాధారంగా చేసుకున్న గొల్ల, కురుమ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. కరీంనగర్‌లోని పద్మనగర్ ఇందిరా గార్డెన్స్‌లో శనివారం నిర్వహించిన గొర్రెల పెంపకందారుల సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి గొర్రెలు, మేకల బీమా పథకాన్ని ప్రారంభించారు. ఒక్కో గొర్రె లేదా మేకకు ఏడాదికి రూ.13 చెల్లిస్తే బీమా వర్తిస్తుందని, మిగతా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు.గొర్రెలు, మేకల పెంపకందారులు వలస వెళ్లే సమయంలో జీవాలు ప్రమాదాలకు గురై నష్టపోతున్నారని, ఈ సమస్యకు బీమా పథకం భరోసా కల్పిస్తుందని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణలో గొర్రెలు, మేకల పెంపకానికి మంచి అవకాశాలున్నాయని, ఉత్పత్తిని పెంచి మార్కెట్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పెంపకందారుల రుణాల మాఫీ అంశంపై చర్యలు తీసుకుంటామని, 55 ఏళ్లకే పింఛన్ అందించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఎన్‌సీడీసీ రుణాల మాఫీ, కరీంనగర్‌లో హోల్‌సేల్ మాంసం మార్కెట్ ఏర్పాటుపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు.కులవృత్తిని కొనసాగిస్తూనే పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని మంత్రులు సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గొర్రెల పెంపకందారుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

# పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ

**భువనగిరి సెప్టెంబర్ 26 మహా న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సీతారాంపురం గ్రామపంచాయతీ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా వికలాంగుల హెల్పింగ్ సొసైటీ ఫౌండర్ అండ్ అధ్యక్షుడు సింగారం రమేష్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ప్రాణాలను లెక్కచేయకుండా పోరాడిన వీర వనిత స్ఫూర్తిని కొనియాడుతూ, వీరనా రీ చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా చిత్రపటానికి ఘనంగా పూలమాలతోని నివాళులర్పించడం జరిగింది. గడీల పాలనకు దొరల అహంకారానికి వ్యతిరేకంగా పోరాడిన ధీరవనిత చాకలి ఐలమ్మ స్ఫూర్తిని నేటితరం యువత అందిపుచ్చుకోవాలని కోరారు. నేటి యువత పోరాట స్ఫూర్తిని కోల్పోతూ మత్తు పానీయాలకు వ్యసనాలకు బానిసలు అవుతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి యువత చైతన్యం కలిగి పోరాట స్ఫూర్తిని నింపుకొని దేశం కోసం, దేశ సమగ్రత కోసం పాటుపడాలని కోరారు. గ్రామ సర్పంచి,కాళీ. పద్మ వెంకన్న మాట్లాడుతూ ప్రతి మహిళ కూడా వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తిని కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మల్లె పాక .నరేష్, వార్డ్ మెంబర్స్ శ్రీను, మోహన్, శేఖర్, సుమతి, గ్రామ సెక్రెటరీ విజయ, అంగన్వాడీ టీచర్ వాణిశ్రీ,ఆశ వర్కర్ లావణ్య,కవిత, కృష్ణయ్య, శ్రీశైలం, సోమయ్య, తదితరులు పాల్గొన్నారు



# చిట్యాల ఐలమ్మ పోరాటం చిరస్మరణీయం

**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్ మహా ;** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, దొరల గడీలను బద్దలుకొట్టిన ధీర వనిత చిట్యాల ఐలమ్మ (చాకలి ఐలమ్మ) 131 జయంతి జయంతి సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, మాజీ కౌన్సిలర్అయిల్ కుమార్, రజక సంఘం నాయకులతో కలిసి శనివారం గ్రేటర్ శంషాబాద్ పరిధిలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.సందర్భంగా అయన మాట్లాడుతూఒక సామాన్య కుటుంబంలో జన్మించిన చాకలి ఐలమ్మ నాటి నిజాం పాలనకు భూస్వాముల అణచివేతకు వ్యతిరేకంగా ఆమె పోరాటం చేసింది. తన పొలంలో పండిన ధాన్యాన్ని దొరల పాలు కాకుండా, ప్రాణాలకు తెగించి కాపాడుకున్న వీర వనిత అని కొనియాడారు. ఆమె రగిలించిన ఆ పోరాట స్ఫూర్తి చుట్టుపక్కల గ్రామాలకు వ్యాపించి, నిజాం వ్యతిరేక సాయుధ పోరాటానికి ఒక బలమైన పునాది వేసిందన్నారు. పీడిత ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు ఆమె ఒక దిక్సూచిలా నిలిచారు. మహిళలు అబలలు కారు, తిరగబడితే యుద్ధాలు చేయగలరుని నిరూపించిన మహోన్నత శక్తి ఆమె. అన్యాయాన్ని ఎదిరించడంలో ఆమె చూపిన తెగువ, ఆత్మస్థైర్యం నేటి తరానికి ఆదర్శం కావాలన్నారు. పార్టీ నాయకులు,కుల సంగమ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.శంషాబాద్ మండలం పెద్ద తూప్రరా గ్రామంలో మాజీ ఎంపీపీ దిద్యాల జయమ్మ శ్రీనివాస్, సర్పంచ్ అంకం సుమలత రాజు యాదవ్, రజక సంఘం నాయకులతో కలిసి చాకలి ఐలమ్మ 131 జయంతి సందర్భంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలోఅంజయ్య, దిద్యాల బాలరాజ్, ప్రవీణ్, రమేష్, గంగాపురం అంజయ్య, కట్టుకూరి ప్రవీణ్, కట్కూరి సురేష్, రజక సంఘం సభ్యులు, పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ నిమజ్జనం కోసం పెద్ద తాళ్లకుంటను శుద్ధి చేయాలంటు

- జోనల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేసిన బిజెపి నాయకులు....

**రాజేంద్రనగర్ మహా ;** హైదర్ గూడా డివిజన్ పరిధిలో పెద్ద తాళ్లకుంట పరిసర ప్రాంత నివాసితులు ప్రతి సంవత్సరం తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాల ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ఇక్కడ మహిళలు, ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుపుకుంటారు.ఈ పెద్ద తాళ్లకుంట డ్రైనేజీ నీటితో కంపుగా మారింది. బతుకమ్మలను నిమజ్జనం కోసం పెద్ద తాళ్లకుంటను శుద్ధి చేయాలి, వీధిలైట్లు ఏర్పాటు చేయాలి, తాళ్లకుంట వద్ద మంచినీటి బోరు వేసి బతుకమ్మల నిమజ్జనం చేయాలని బిజెపి నాయకులు మల్లారెడ్డి,విజయ్ ముదిరాజ్, సత్యనారాయణ, కిరణ్, కిట్టు రాజులతో కలిసి శనివారం రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు.



## అసహజ మరణాలపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు

**జవహర్ నగర్, మహా :** సకల జీవరాసుల కాలచక్రాన్ని ధ్వంసం చేస్తున్న డంపింగ్ యార్డ్ ఎత్తివేతే ప్రధాన ధ్యేయమని, కాలుష్య మరణాల కారకులు డంపింగ్ యాజమాన్యమేనని జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ పేర్కొంది. ఇటీవల జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ప్రభావిత ప్రాంతాల్లో వరసగా జరుగుతున్న అసహజ మరణాలపై ప్రభుత్వం పోలీసులు తగిన చట్టబద్ధమైన చర్యలు చేపట్టాలని, బొల్లం కృష్ణ బాధిత కుటుంబ సభ్యులచే శనివారం జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ లో డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ కంటికి కనిపించని వైరస్ లాగా డంపింగ్ నుండి వెలబడే విషపు గాలుల వలన రకరకాల వ్యాధులకు గురై అర్ధాంతరంగా మృత్యువాత పడుతున్న అకాల మరణాలకు కారణమవుతున్న రాంకీ యాజమాన్యం సిబ్బందిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. చట్టపరంగా తమ పరిధిలో వచ్చే వాటిపై సాక్షాధారాలు ఉంటే తప్పకుండా చర్యలు ఉంటాయని విషయాన్ని ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ తెలియజేశారని తెలిపారు. సానుకూలంగా స్పందించినందుకు సీఐకి జేఏసీ కమిటీ ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికైనా రాజకీయాలకు అతీతంగా ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, అధికార పార్టీ డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత కొరకై కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఇఫ్తు షేక్షావలి, ఉమా మహేష్, శివ బాబు, గడ్డం సదానందం, సుబ్రహ్మణ్యం, మల్లేష్, జయ, జాన్, గడిపే సునీల్, ప్రవీణ్, అంబాల ఎల్లయ్య, బొల్లం కృష్ణ బంధువులు తదితరులు పాల్గొన్నారు.




## పరిశోధన సమాజ సవాళ్లకు అర్థవంతమైన పరిష్కారాలను అందించేలా ఉండాలి

- **చైతన్య విశ్వవిద్యాలయం ఫౌండర్ & ఛాన్సలర్ డాక్టర్ సి.హెచ్. వి పురుషోత్తం రెడ్డి**

**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్‌లోని చైతన్య (డీమ్డ్ టు బి) యూనివర్సిటీ ప్రాంగణంలో 2026-27 విద్యా సంవత్సరానికి పి హెచ్ డి పరిశోధక విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. నూతనంగా పిహెచ్.డి.లో ప్రవేశం పొందిన పరిశోధక విద్యార్థులకు విశ్వవిద్యాలయ పరిశోధనా విధానాలు, అకడమిక్ నిబంధనలు, పరిశోధనా పద్ధతులు, పరిశోధనా నైతికత, కోర్సు వర్క్, పరిశోధన పర్యవేక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. ఈ కార్యక్రమానికి చైతన్య (డీమ్డ్ టు బి) యూనివర్సిటీ ఫౌండర్ & ఛాన్సలర్ డాక్టర్ సి.హెచ్. వి. పురుషోత్తం రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పరిశోధక విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పి హెచ్ డి చేయడం అనేది కేవలం ఒక విద్యా అర్హతను సంపాదించడం మాత్రమే కాదు. అది జ్ఞానాన్వేషణ, సత్యాన్వేషణతో పాటు సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు అర్థవంతమైన పరిష్కారాలను కనుగొనే బాధ్యతను స్వీకరించడం అలాగే పరిశోధక విద్యార్థులు తమ పరిశోధనను కేవలం డిగ్రీ సాధించేందుకు అవసరమైన ప్రక్రియగా భావించకుండా, సమాజానికి విలువైన జ్ఞానాన్ని, పరిష్కారాలను అందించే బాధ్యతగా చూడాలని ఆయన సూచించారు. పరిశోధన యొక్క అసలైన లక్ష్యం జ్ఞానాన్ని విస్తరించడం, వాస్తవ జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడం, సమాజంపై సానుకూల ప్రభావాన్ని చూపించే విధంగా ఉండాలని ,శాస్త్రీయ, సాంకేతిక పురోగతులు ప్రజల అవసరాలు, ఆకాంక్షలు, సామాజిక అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా ఉన్నప్పుడే వాటికి మరింత ప్రాధాన్యత లభిస్తుందని ఆయన అన్నారు. పరిశోధక విద్యార్థులు సమాజానికి సంబంధించిన సమస్యలను గుర్తించి, వాటిపై లోతైన అధ్యయనం చేసి, స్పష్టమైన ఫలితాలు మరియు ఆచరణాత్మక పరిష్కారాలను అందించే పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. అలాగే పరిశోధనలో పరిమాణం కంటే నాణ్యత, పునరావృతం కంటే మౌలికత, పరిశోధన కోసం పరిశోధన కంటే సామాజిక ప్రయోజనం ముఖ్యమైనవి. ప్రతి పరిశోధకుడి పరిశోధన సమాజానికి ఉపయోగపడే జ్ఞానంగా, భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలవాలి అని తెలిపారు. అనంతరం డైరెక్టర్ & చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సి.హెచ్. సాత్విక రెడ్డి మాట్లాడుతూ, పరిశోధకులు సాంప్రదాయ పరిశోధనా విధానాలను అధిగమించి బహుళ శాస్త్ర రంగాల దృక్పథాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. నేటి సంక్లిష్ట సవాళ్లను ఒకే శాస్త్ర రంగం పరిధిలో పరిష్కరించడం ఎల్లప్పుడూ సాధ్యం కాదని, వివిధ రంగాల మధ్య సహకారం, ఆవిష్కరణలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని బాధ్యతాయుతంగా వినియోగించడం ద్వారా పరిశోధనకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని, అలాగే పరిశోధన బలమైన నైతిక విలువలతో కొనసాగాలని ఆమె పేర్కొన్నారు. విద్యా నిజాయితీ, మౌలికత, పారదర్శకత, పరిశోధనా నైతికత పట్ల నిబద్ధత పరిశోధకుడి విశ్వసనీయతకు పునాదులని అన్నారు. పిహెచ్.డి. సిద్ధాంత వ్యాసం పరిశోధకుడి విద్యా సామర్థ్యాన్ని మాత్రమే కాకుండా, నిజాయితీ, నాణ్యత, శ్రేష్ఠత పట్ల ఉన్న నిబద్ధతను కూడా ప్రతిబింబించాలని, చైతన్య విశ్వవిద్యాలయంలోని ప్రతి పరిశోధక విద్యార్థి పరిమాణం కోసం కాకుండా నాణ్యత కోసం, పునరావృతం కోసం కాకుండా మౌలికత కోసం, పరిశోధన కోసమే కాకుండా సామాజిక ప్రాసంగికత కోసం కృషి చేయాలి తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి. శంకర్ లింగం, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. రవీందర్, వివిధ విభాగాల శాఖాధిపతులు, పరిశోధన పర్యవేక్షకులు, పిహెచ్.డి. పరిశోధక విద్యార్థులు, విద్యార్థినులు మరియు అసిస్టెంట్ రిజిస్ట్రార్ & పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ గాదె రాంబాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం నేటి సమాజానికి స్ఫూర్తిదాయకం

- **తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం అసెంబ్లీ ఇంచార్జి బేగరి రాజు**



**మొయినాబాద్ మహా:** తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం నేటి సమాజానికి స్ఫూర్తిదాయకం వెట్టిచాకి విముక్తి కోసం ఆమె చేసిన పోరాటం మరిచిపోనిది టీఆర్ఎస్ పార్టీ చేవెళ్ళ అసెంబ్లీ నియోజవర్గం ఇంచార్జ్ బేగరి రాజు అన్నారు శనివారం నాడు మొయినాబాద్ మండల చౌరస్తాలో రజక సంఘం మొయినాబాద్ మండల అధ్యక్షులు చాకలి వినోద్ కుమార్, రజక సంఘం మొయినాబాద్ మండల ఉపాధ్యక్షులు పెండ్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 131వ జయంతిని ఘనంగా నిర్వహించారు ముందుగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం టిఆర్ఎస్ పార్టీ చేవేళ్ల నియోజకవర్గం ఇంచార్జి బేగరి రాజు, రజక సంఘం చేవేళ్ల నియోజకవర్గం అధ్యక్షులు చాకలి మల్లేష్, కాంగ్రెస్ పార్టీ మొయినాబాద్ మండల మాజీ అధ్యక్షులు తమ్మాలి మానేయ్య టిఆర్ఎస్ పార్టీ మొయినాబాద్ మున్సిపాలిటీ మండల అధ్యక్షులు ఎండి అన్వర్ ఖాన్, టిఆర్ఎస్ పార్టీ మొయినాబాద్ మండల అధ్యక్షులు మేకగూడెం బిక్షపతి కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకులు కేబుల్ రాజు మాట్లాడుతూ వరంగల్ జిల్లా పాలకుర్తి కి చెందిన చిట్యాల ఐలమ్మ 1895లో జన్మించారు భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం, కులవృత్తిని ఎంచుకొని మహిళా అంటే అబల కాదు సబల అని నిరూపించిన తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ అన్నారు ఆనాడు కమ్యూనిస్టులు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ఉవ్వెతున సాగుతున్న తరుణంలో ఆంధ్ర మహాసభలో చేరి దున్నే వాడికి భూమి ఉండాలని పేదలకు లక్షల ఎకరాలను భూమి పంచిన ఘన చరిత్ర చాకలి ఐలమ్మకు ఉంది. అని నేటి సమాజానికి మహిళలకు ఆదర్శంగా మహిళ అని వారు గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో గుర్రాల భాస్కర్,పన్నగారి యాదగిరి,చాకలి శ్రీనివాస్, చాకలి మహేందర్, వాడే సంతోష్ తదితరులు పాల్గొన్నారు.





# చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

- **విగ్రహానికి పూల మాల వేసి కంది శ్రీనివాస రెడ్డి నివాళి**
- **ఆమె సేవలను కొనియాడిన నేత**

**ఆదిలాబాద్ మహా :** వీరనారి చాకలి ఐలమ్మ పోరాట పటిమ, ధైర్యసాహసాలు ఆదర్శనీయమని భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం నాడు నిజాం రజాకార్లకు, భూస్వాములకు ఎదురొడ్డి నిలిచిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి కొనియాడారు. ఆమె జయంతిని పుస్కరించుకొని శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని రిమ్స్ వద్ద గల ఐలమ్మ విగ్రహానికి పార్టీ శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళ్లు అర్పించారు. బడుగు బలహీన అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆమె ఎంతో కృషి చేసారని గుర్తు చేసారు. ఆమె ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. రజక కులస్థులు సామాజిక, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి సాధించి అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ , ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, నాయకులు శాంతన్ రావు, కొండా గంగాధర్, రఫిక్, విట్టల్ రెడ్డి, షకీల్, సంటెన్న,ప్రభాకర్,సాహెబ్ రావు,భోరజ్ మండల నాయకులు బత్తుల శ్రీనివాస్, దీపక్ రావు, ప్రకాష్, అశోక్, నారాయణ, రాజన్న రజక సంఘం నాయకులు చిక్కాల దత్తు తదితరులు పాల్గొన్నారు.

## బాధలో బాసటగా.. కంది శ్రీనివాస రెడ్డి పరామర్శలు

**ఆదిలాబాద్ మహా**: ఆప్తులను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్నవారి కుటుంబాలకు ,అనారోగ్యంతో బాధపడుతున్నవారి చెంతకు వెళ్లి వారికి కొండంత ధైర్యాన్ని ఇస్తారు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి. శనివారం ఆయన భోరజ్ , జైనథ్ మండలాలలోని పలు గ్రామాలలో పర్యటించారు.ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన భోరజ్ మండలం లేఖర్ వాడ గ్రామానికి చెందిన సంద రవి , సిర్సన్న గ్రామానికి చెందిన నాయిడి శివయ్య ,జైనథ్ మండలం దీపాయిగూడ గ్రామానికి చెందిన లోక జయప్రకాష్ నారాయణ రెడ్డి,బెల్గం గ్రామానికి చెందిన సర్పట్ వార్ మురళీధర్, లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఏడవ్ రాములు, కరంజి గ్రామానికి చెందిన జితేందర్ రెడ్డి , మేస్త్రం గంగు బాయి ల నివాసాలకు వెళ్ళి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. జైనథ్ మండలం సంగ్వి గ్రామానికి చెందిన నేరెళ్ల ఆశన్న అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆయన నివాసంలో పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, నాయకులు శాంతన్ రావు, కొండా గంగాధర్, రఫిక్, విట్టల్ రెడ్డి, షకీల్, సంటెన్న,ప్రభాకర్,సాహెబ్ రావు,భోరజ్ మండల నాయకులు జగదీష్ రెడ్డి,బత్తుల శ్రీనివాస్, దీపక్ రావు, ప్రకాష్, అశోక్, నారాయణ, రాజన్న తదితరులున్నారు.











## ఇంటికే వెళ్లి చెక్కు అందించిన కంది శ్రీనివాస రెడ్డి





**ఆదిలాబాద్ మహా :** పేద బడుగు బలహీన వర్గాల సంక్షేం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. పేదల వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధినుండి వచ్చిన చెక్కును ఆయన బాధితురాలికి అందించారు. బేలా మండలం బెదోడా గ్రామానికి చెందిన రాజేండ్ల వార్ వనిత కు మంజూరైన 60 వేల రూపాయల చెక్కును ఆమె నివాసానికి వెళ్లి అందించారు. సీయంఆర్ ఎఫ్ సహాయం కోసం తన క్యాంపు కార్యాలయం లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసామని ఆసుపత్రుల్లో డబ్బుల పెట్టి వైద్యం చేయించుకున్నవారికి ముఖ్య మంత్రి సహాయ నిధినుండి ఆర్థిక సాయంకోసం దరఖాస్తు పెట్టుకోవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, నాయకులు శాంతన్ రావు, కొండా గంగాధర్, రఫిక్, విట్టల్ రెడ్డి, షకీల్, సంటెన్న,ప్రభాకర్,సాహెబ్ రావు,బేల మండల నాయకులు సుధాం రెడ్డి, నగేష్ రెడ్డి, బండి సుదర్శన్, గట్లేవర్ రవి, నాక్లే రాందాస్, బొక్రె శంకర్, నానాజీ పటేల్,రాజా రెడ్డి, టెకం సత్యపాల్, విలాస్ పటేల్, బేతం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు..

## పొద్దుటూరు, ఏదుల్లగూడెం గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించాలి

- **ఆర్టీసీఅధికారులుఅధికార పార్టీ ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్య వైఖరిని వీడాలి.**
- **సిపిఎం డిమాండ్**



**వలిగొండ సెప్టెంబర్ 26 మహా న్యూస్:** పొద్దుటూరు ,ఎదుల్లగూడెం గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆర్టీసీ అధికారుల మరియు అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్య వైఖరిని వీడాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు . శనివారం వలిగొండ మండల పరిధిలోని ఎదుళ్లగూడెం స్టేజి వద్ద సిపిఎం, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో రాస్తారోకో కార్యక్రమాన్ని చేపట్టారు ఈ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ ప్రొద్దుటూరు ఏదుళ్ళగూడెం గ్రామాలకు బస్సు సౌకర్యాన్ని కల్పించాలని ఇప్పటికే అనేకమార్లు స్థానిక ప్రజాప్రతినిధులకు ఆర్టీసీ యాదగిరిగుట్ట డిపో మేనేజర్ కు,స్థానిక ఎమ్మెల్యేకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకునే పరిస్థితులు లేవని ఈ రెండు గ్రామాలకు సంబంధించిన అనేకమంది ప్రయాణికులు విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు వెంటనే ఇప్పటికైనా తమ నిర్లక్ష్య వైఖరిని విడనాడి బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు స్థానిక భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అనేక గ్రామాలకు బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నామని గొప్పలు చెబుతున్నారని పొద్దుటూరు, ఎదుల్లగూడెం గ్రామాలకు మాత్రం గత మూడు సంవత్సరాలుగా ఆర్టీసీ బస్సు ఎందుకు వేయలేక పోయారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు ఇప్పటికైనా ఆ గ్రామ ప్రజల తీవ్రమైన సమస్యగా ఉన్న బస్సు సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో ఎదుళ్ళగూడెం గ్రామ సర్పంచ్ కొంతం శ్రీనివాస్ గౌడ్, సిపిఎం మండల కమిటీ సభ్యులు దుబ్బ లింగం, మాజీ ఎంపిటీసీ భూమి మాధవి బాలశంకర్, సిపిఎం శాఖ కార్యదర్శి పలుసం లింగం, డివైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు పెద్ద బోయిన భీమరాజు, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు దండు వేణు, సిపిఎం నాయకులు బత్తుల నరసింహ, బత్తిని అంజమ్మ, బొడ్డు శంకర్, పెద్ద బోయిన శివశంకర్, విద్యార్థినీ విద్యార్థులు, రెండు గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా :** ఇందిరమ్మ ఇండ్లతో తెలంగాణ ప్రభుత్వం పేదవాడి సొంతింటి కల నెరవేర్చుతుందని ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం భోరజ్ మండలం సిర్సన్న గ్రామంలోని ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు కురుమ ఆశక్క నారాయణ పూజ, విజయ్ దంపతుల నివాసాన్ని సందర్శించారు. రిబ్బన్ కట్ చేసి ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. దంపతులకు శుభాకాంక్షలు తెలిపి నూతన వస్త్రాలు బహుకరించారు.అనంతరం పేదల వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధినుండి కుర్మ ఆశక్క కు వచ్చిన 40 వేల రూపాయల చెక్కును అందించారు. సీయంఆర్ ఎఫ్ సహాయం కోసం తన క్యాంపు కార్యాలయం లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసామని ఆసుపత్రుల్లో డబ్బుల పెట్టి వైద్యం చేయించుకున్నవారికి ముఖ్య మంత్రి సహాయ నిధినుండి ఆర్థిక సాయంకోసం దరఖాస్తు పెట్టుకోవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, నాయకులు శాంతన్ రావు, కొండా గంగాధర్, రఫిక్, విట్టల్ రెడ్డి, షకీల్, సంటెన్న,ప్రభాకర్,సాహెబ్ రావు,భోరజ్ మండల నాయకులు జగదీష్ రెడ్డి,బత్తుల శ్రీనివాస్, దీపక్ రావు, ప్రకాష్, అశోక్, నారాయణ, రాజన్న తదితరులు పాల్గొన్నారు..



## నిమజ్జనం ప్రశాంతం

- **గంగమ్మ ఒడికి గణపయ్యలు**
- **ధన్యవాదాలు తెలిపిన జిల్లా అధికారులు**

**ఆదిలాబాద్ మహా:** పదకొండు రోజుల పాటు భక్తుల పూజలందుకున్న గణనాధులు శనివారం ఉదయం గంగమ్మ ఒడికి చేరారు. ఆదిలాబాద్ జిల్లా మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న పెన్ గంగా నదిలో మండపాల నిర్వాహకులు విగ్రహాలను నిమజ్జనం చేసారు.మున్సిపల్ జిల్లా అధికారులు ఏర్పాటు చేసిన భారీ క్రేన్ల సహాయంతో బొజ్జ గణపయ్యలను పెన్ గంగానదిలో నిమజ్జనం చేసారు.శుక్రవారం సాయంత్రం మొదలైన ప్రక్రియ శనివారం మధ్యాహ్నం వరకు సాగింది.భారీ విగ్రహాలను పెన్ గంగా నదికి తరలించి నిమజ్జనం చేసారు. చిన్న విగ్రహాలను చాందా వాగులో నిమజ్జనం చేసారు. చెదురు ముదురు ఘటనలు మినహా నిమజ్జన ఘట్టం చాలా ప్రశాంతంగా జరిగింది. పెన్ గంగా వద్ద నిమజ్జన ప్రక్రియను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించారు. పోలీసు యంత్రాంగం సమర్ధవంతంగా విధులను నిర్వర్తించి ప్రశాంత వాతావరణంలో నిమజ్జనమయ్యేలా చేసినందుకు పోలీసు సిబ్బందిని అబినందించారు. జిల్లా యంత్రాంగానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.



## మంచిర్యాలలో జీజీహెచ్ లో డయాలసిస్ యూనిట్ ఏర్పాటు చేయాలి

- **మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుకు వినతి**

**మంచిర్యాల, మహా :** జిల్లా కేంద్రంలో పేద ప్రజల వైద్యం కోసం నూతనంగా ప్రారంభించబోయే ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జి.జి.హెచ్) లో డయాలసిస్ పేషెంట్ల కోసం ప్రత్యేక డయాలసిస్ యూనిట్ ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్తలు శనివారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త వంజరి వెంకటేష్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కొనసాగుతున్న డయాలసిస్ సెంటర్ పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, అది ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం అవకాశం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాత్కాలికంగా పాత మెడికల్ కాలేజీలో మంజూరు చేసిన షెడ్డులో కనీస వసతులు లేవని ఆరోపించారు. ప్రతి 10 డయాలసిస్ లకు ఒకసారి చేయాల్సిన బ్లడ్ స్క్రీనింగ్ టెస్ట్ కోసం దూరంగా ఉన్న ల్యాబ్ కు వెళ్లాల్సి వస్తోందని, అక్కడ నిరంతర డాక్టర్ పర్యవేక్షణ లేదని, విద్యుత్ అంతరాయం ఏర్పడితే బ్యాకప్ సౌకర్యం లేదని ఆయన చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆసుపత్రికి తరలించడం కష్టంగా మారిందని, బస్టాండ్ కు దూరంగా ఉండటంతో రాకపోకలు భారంగా మారాయని బాధితులు వాపోతున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి ఆయన తీసుకువెళ్లినట్లు వెల్లడించారు. ఈ సమస్యలను పరిగణలోకి తీసుకున్న ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు నూతన జి.జి.హెచ్ ఆసుపత్రిలో డయాలసిస్ యూనిట్ బ్లాక్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రావుల లక్ష్మీ బాబు, అడిగోప్పుల మురళి, బండి హరీష్, నాగవత్ శేఖర్ నాయక్, రావుల రామచందర్, రావుల మల్లయ్య పాల్గొన్నారు.





# ఉపాధ్యాయుడు ఇలా... విద్యార్థులు అలా..!

- ఆన్‌లైన్ పత్తాల ఆటలో సారు బిజీ.. బడిలో (ఎఫ్.ఆర్.ఎఫ్.) వేసి ఇళ్లకు పయనం..!?
- మామిడిగట్టు ప్రభుత్వ పాఠశాల తీరుపై గ్రామస్తుల ఆగ్రహం

**మందమర్రి / మంచిర్యాల మహా :** మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం మామిడిగట్టు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల నిర్లక్ష్యం తారస్థాయికి చేరిందని స్థానికులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నెలకు దాదాపు లక్ష రూపాయల వరకు వేతనం తీసుకుంటున్న ఓ ఉపాధ్యాయుడు విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిందిపోయి, తరగతి గదిలోనే నిద్రపోతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. పాఠశాలకు వెళ్లిన గ్రామస్తులకు సారు కుర్చీలో కూర్చుని టేబుల్ పై తలవార్చి నిద్రపోతూ దర్శనమిచ్చినట్లు వారు చెబుతున్నారు. ఇలా అయితే బడి పక్కనే సార్ కోసం తలా కొంత డబ్బు పోగు చేసి బెడ్‌రూమ్ కట్టించాలంటూ గ్రామస్తులు వ్యంగ్యంగా ఎద్దేవా చేస్తున్నారు. ఇక మరో ఉపాధ్యాయుడి తీరు దీనికి మించి ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. పాఠాలు చెప్పడం దేవుడెరుగు తన వెంట తెచ్చుకున్న మొబైల్ ఫోన్‌లో ఆన్‌లైన్ పత్తాల ఆటలో బిజీగా ఉంటున్నారట. అంతేకాకుండా, నిత్యం తన వాహనంతో బడికి రావడం, ఫేషియల్ రికగ్నిషన్ హాజరు (ఎఫ్.ఆర్.ఎఫ్.) నమోదు చేసుకోవడం, ఆ వెంటనే అదే వాహనంలో ఇంటికి వెళ్లిపోవడం షరా మామూలైందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**ప్రజాప్రతినిధుల మందలింపులు బేఖాతర్**

ఈ వ్యవహారమంతా గమనించిన స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ రైతులు పాఠశాల ఉపాధ్యాయులకు పలుమార్లు సర్దిచెప్పినా వారి తీరు మాత్రం మారడం లేదని సమాచారం. ఈ క్రమంలోనే శనివారం మామిడిగట్టు గ్రామస్తులు పాఠశాలకు వెళ్ళగా, ఓ ఉపాధ్యాయుడు కుర్చీలో కూర్చొని టేబుల్ పై తల వాల్చి ఉండగా, మరికొన్ని గదుల తలుపులు దగ్గరికి వేసి ఉండగా, పెద్ద సార్ కుర్చీ ఖాళీగా దర్శనమిచ్చిందని వారు వాపోతున్నారు. విసుగుచెందిన గ్రామస్తులు ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన చెన్నూరు ఎమ్మెల్యే, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలుస్తోంది.

**పరేషాన్ అవుతున్న పేద విద్యార్థులు, తల్లిదండ్రులు**

మామిడిగట్టులో నివసించే ప్రజలందరూ ప్రధానంగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తుంటారు. పిల్లలకు బడిలో చదువు అబ్బడం లేదని తెలిసినప్పటికీ, ప్రైవేటు పాఠశాలలకు పంపించే ఆర్థిక స్తోమత లేక పరేషాన్ అవుతున్నామని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తుల కష్టాలు అర్థం చేసుకుని, విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఫలితాలు రాబట్టాల్సిన ఉపాధ్యాయులు ఇలా వ్యవహరించడం దారుణమని గ్రామస్తులు, మండల మేధావులు విమర్శిస్తున్నారు.ఇప్పటికైనా ఉపాధ్యాయులు తమ తీరు మార్చుకోవాలని, లేనిపక్షంలో మా ఊరు బడి నుంచి మరో ప్రభుత్వ పాఠశాలకు పిల్లలను మారుస్తామని గ్రామస్తులు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు. మామిడిగట్టు గ్రామంలో జరుగుతున్న ఈ వ్యవహారంపై మందమర్రి మండలం విద్యాశాఖ అధికారి స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# గ్రామీణాభివృద్ధికి సమగ్ర కార్యాచరణతో ముందుకు

- మంచినీటికి అత్యధిక ప్రాధాన్యత – మంత్రి సీతక్క




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పన, గ్రామీణ రహదారుల అభివృద్ధి, మంచినీటి సమస్యల పరిష్కారానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు.శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా అంశాలపై ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్, నల్గొండ జిల్లాల అధికారులతో నిర్వహించిన సమీక్ష అనంతరం మంత్రి సీతక్క పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. రాబోయే కాలంలో వర్షాభావ పరిస్థితులు, వరదలు, మంచినీటి అవసరాలు తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని ప్రాంతాల వారీగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు.

**గ్రామీణ రహదారుల అభివృద్ధికి రూ.3,382 కోట్లు...**

ఉమ్మడి నాలుగు జిల్లాల పరిధిలో 1,013 గ్రామీణ రహదారుల అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. ఇందుకోసం సుమారు రూ.3,382 కోట్లను వెచ్చించనున్నట్లు వెల్లడించారు. దసరా అనంతరం అక్టోబర్ 25 లేదా 26వ తేదీ నుంచి గ్రామీణ రహదారులకు సంబంధించిన పనులను ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. పనుల నాణ్యత, పురోగతిని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించినట్లు పేర్కొన్నారు.

**మంచినీటికి అత్యధిక ప్రాధాన్యత...**

వర్షపాతం లోటు కారణంగా ఏర్పడే పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని మంచినీటి సరఫరాకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి సీతక్క తెలిపారు. సింగూరు జలాశయంలో నీటి నిల్వలు పరిమితంగా ఉన్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ బోర్లు, బావులు, ఇతర స్థానిక నీటి వనరులను వినియోగించుకునేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. రానున్న వేసవి వరకు మంచినీటి సమస్య తలెత్తకుండా ఉమ్మడి నాలుగు జిల్లాలకు సుమారు రూ.30 కోట్ల మేర అవసరమైన నిధులను సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**'జలశ్రీ'తో ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలి...**

భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు నీటి సంరక్షణకు 'జలశ్రీ' కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇంటికి ఇంకుడు గుంత, పంటకు పంట కుంట, ఊరికి ఊట కుంట, బోరు రీచార్జ్ వంటి పనులతో పాటు అవసరమైన ప్రాంతాల్లో చెక్‌డ్యామ్‌ల నిర్మాణాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. గిరిజన ప్రాంతాల్లోనూ నీటి సంరక్షణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

**ఉపాధి హామీ పనులతో గ్రామాల అభివృద్ధి...**

ఉపాధి కల్పనతో పాటు గ్రామాల్లో మౌలిక వసతులను అభివృద్ధి చేయడానికి ఉపాధి హామీ పథకం నిధులను సమర్థవంతంగా వినియోగించాలని మంత్రి సూచించారు. కాలువలు, డ్రైనేజీలు, సోక్‌పిట్లు, ఫామ్ పాండ్లు, చెరువుల అభివృద్ధి, గ్రామీణ మౌలిక వసతుల నిర్మాణం వంటి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

**గ్రామపంచాయతీ, మహిళా భవనాల నిర్మాణానికి ప్రాధాన్యత...**

రాష్ట్రంలో అవసరమైన చోట గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాన్ని పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. గతంలో చేపట్టిన సుమారు 3,000 గ్రామపంచాయతీ భవనాల్లో దాదాపు 1,000 భవనాలు పూర్తయ్యే దశలో ఉన్నాయని, ఈసారి మరో 1,800 భవనాలను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అదేవిధంగా 9,000కు పైగా మహిళా భవనాల నిర్మాణాన్ని కూడా చేపడుతున్నట్లు వెల్లడించారు.

**గ్రామ సమగ్ర ప్రణాళికతో అభివృద్ధి...**

ప్రతి గ్రామానికి సమగ్ర ప్రణాళిక రూపొందించి, గ్రామంలోని చెరువులు, వాగులు, పాఠశాలలు, ఇంకుడు గుంతలు, ఇతర మౌలిక వసతులను మ్యాప్‌లో గుర్తించి అవసరమైన అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టేందుకు సర్పంచులకు శిక్షణ ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని గ్రామాల్లో అవసరమైన అభివృద్ధి పనులపై తీర్మానాలు చేసి, అందుబాటులో ఉన్న నిధులను ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగించాలని సర్పంచులకు మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు.



# మున్సిపల్ కార్మికుల సేవలు భేష్

**వేములవాడ, మహా;** వేములవాడ పట్టణంలోని 12వ వార్డులో రెండు రోజుల క్రితం మూగజీవులు చనిపోయి దుర్వాసన వెదగలుగుతుంటే వెంటనే కాలనీ వాసులు మునిసిపల్ సిబ్బంది అయినా జవాన్ మహేందర్ కి ఫిర్యాదు చేయగా వెంటనే సంబంధిత సిబ్బందిని కాలనీకి పంపగా వారు సాహసోపేతంగా దుర్వాసన వచ్చే కళేబరాలను తొలగించడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయ సిబ్బంది సేవలను కొనియాడారు.



# వీరనారి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం

**చాకలి ఐలమ్మను తెలంగాణ తల్లిగా ప్రకటించాలి: దర్ముల రవి**

**పెద్దపల్లి మహా :** కాల్వ శ్రీరాంపూర్: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శమని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి పెద్దపల్లి జిల్లా యూత్ అధ్యక్షుడు దర్ముల రవి అన్నారు. చాకలి ఐలమ్మను తెలంగాణ తల్లిగా ప్రకటించాలని ఆయన కోరారు. చాకలి ఐలమ్మ 131వ జయంతిని పురస్కరించుకుని శనివారం పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం పందిళ్ల గ్రామంలో దర్ముల రవి ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా దర్ముల రవి మాట్లాడుతూ.. తొలి భూపోరాటానికి నాంది పలికిన వీరమాత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. సామాజిక ఆధునిక పరిణామాలకు నాంది పలికిన ధైర్యశాలి ఐలమ్మ అని పేర్కొన్నారు. ఆమె సేవలు, పోరాట చరిత్ర మరువలేనివని అన్నారు. ఐలమ్మను ఆదర్శంగా తీసుకుని ఆమె ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆమె ధీర చరిత్ర ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొంది, ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచిందని దర్ముల రవి అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మిట్టపల్లి కొమురయ్య, మాజీ ఎంపీటీసీ రావి సదానందం, మాజీ సర్పంచ్ అట్టికం శంకరయ్య, మాజీ ఉపసర్పంచ్ ఇల్లందుల రమేష్, గ్రామపంచాయతీ కార్యదర్శి మహేందర్, వార్డు సభ్యులు ఇల్లందుల శంకర్, కొత్తగట్టు కళ్యాణి మధు, తాండ్ర రమేష్, చిలుముల వినేష్, ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్, పోతరవేన మహేందర్, రజక సంఘం నాయకులు దబ్బేట సంపత్, శ్రీనివాస్, శ్రీకాంత్, రామ్మూర్తి, హరీష్, శివాజీ, భూమేష్, రమేష్, కనకయ్యతో పాటు గ్రామ యువకులు అట్టికం అనిల్, మిట్టపల్లి శివ, మహేష్, శ్యాంబాబు, సురేష్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.



# కారుకొండ బౌద్ధారామాలయాలను సందర్శించిన విద్యార్థులు

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకొని శ్రీ రామచంద్ర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల(అటానమస్), కొత్తగూడెం చరిత్ర శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన హెరిటేజ్ వాక్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు కారుకొండ ప్రాచీన బౌద్ధారామాలయాలను సందర్శించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ పి.పద్మ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చారిత్రక వారసత్వ సంపదను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం కేవలం పర్యాటక రంగ ప్రాముఖ్యతను గుర్తు చేయడమే కాకుండా స్థానిక చారిత్రక సాంస్కృతిక సహజ వారసత్వ సంపదను సంరక్షించాల్సిన బాధ్యతను కూడా గుర్తు చేస్తుందని తెలిపారు. హెరిటేజ్ వాక్‌లో భాగంగా విద్యార్థులు కారుకొండ కొండపై ఉన్న ప్రాచీన బౌద్ధ గుహాలయాలు స్థూపాలు బౌద్ధ అవశేషాలను పరిశీలించారు. కొండపై రాతిని చెక్కి నిర్మించిన ఈ బౌద్ధ గృహాలు ప్రాచీన శిల్పకళా వైభవానికి నిదర్శనంగా నిలుస్తున్నాయని అధ్యాపకులు వివరించారు. తెలంగాణలోని ప్రముఖ ప్రాచీన బౌద్ధగృహాలలో ఈ కారుకొండ బౌద్ధ గృహాలు ఉన్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకులు డాక్టర్ జి.మధు, డాక్టర్ వి.కామేశ్వర రావు, డి.ధర్మారావు, ఇతర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



# ఓటర్ సవరణ ప్రక్రియలో బీఎల్వోలకు సహకరించండి..

**మున్సిపాలిటీ కమిషనర్ ప్రసాద్..**

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న ఓటర్ సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియలో బీఎల్వోలకు ప్రజలు సహకరించాలని మున్సిపాలిటీ కమిషనర్ ప్రసాద్ కోరారు. బీఎల్వోలు అందజేసిన నోటీసులకు సంబంధించి వారు కోరిన ధ్రువీకరణ పత్రాలను జతపరిచి సకాలంలో అందించాలని సూచించారు. శనివారం ఈ మేరకు ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్ఐఆర్ కార్యక్రమం సజావుగా, పారదర్శకంగా పూర్తి కావడానికి అన్ని ప్రజా సంఘాల ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సహకరించాలని కోరారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదయ్యేలా ప్రజలు తమ వివరాలను పరిశీలించుకుని అవసరమైన సమాచారాన్ని బీఎల్వోలకు అందించాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించడంలో అన్ని వర్గాలు భాగస్వాములు కావాలని తెలిపారు. ప్రజల సహకారంతో ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు.

# నిమజ్జనంలో నిరసన

- పోలీసుల తీరు పై నిర్వహకులు హిందూ సంఘాల అసంతృప్తి
- నిరసనకు బీజేపీ నేతల మద్దతు
- బ్యాండు బృందం పై దాడి చేసారని ఆరోపణ
- అంబేద్కర్ చౌక్ వద్ద బైఠాయింపు
- కలెక్టర్ చొరవతో తిరిగి ప్రారంభం



**ఆదిలాబాద్ మహా:** ఆదిలాబాద్ పట్టణంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన వినాయక నిమజ్జన శోభాయాత్రలో కొంత ఉద్రిక్తత చోటుచేసుకుంది.. శోభాయాత్రలో వాహనాలను త్వరగా ముందుకు తీసుకెళ్లాలని పోలీసులు సూచించిన నేపథ్యంలో వివాదం నెలకొంది. శోభాయాత్రలో బ్యాండ్ బృందంపై దాడి చేశారని కొందరిపై కేసులు కూడా పెట్టారని ఆరోపిస్తూ అంబేద్కర్ చౌరస్తా వద్ద గణేశ్ మండపాల నిర్వాహకులు హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు నిరసన తెలిపారు . వారికి బీజేపీ నాయకులు మద్దతు ప్రకటించారు.రోడ్డుపై బైఠాయించి సామూహిక హనుమాన్ చాలీసా పఠించారు. దీంతో నిమజ్జన శోభాయాత్రకు ఆటంకం కలిగింది. డీజేలు, బ్యాండ్లను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనతో అంబేద్కర్ చౌరస్తా వద్ద నిమజ్జనానికి తరలిస్తున్న విగ్రహాల వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సుమారు కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో సుమారు కొన్ని గంటల పాటు నిమజ్జన ప్రక్రియ కు బ్రేక్ పడింది. ఘటనపై సమగ్ర విచారణ జరిపిస్తామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా వారికి హామీ ఇచ్చారు. నగరంలో గత 60 ఏళ్లుగా గణేశ్ వేడుకలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ,ఈసారి జరిగిన ఘటనలకు కారణమైన అంశాలపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నిమజ్జన కార్యక్రమాలను శాంతియుతంగా, విజయవంతంగా పూర్తి చేద్దామని పిలుపునిచ్చారు.కలెక్టర్ హామీతో మండప నిర్వాహకులు హిందూ సంఘాల ప్రతినిధులు బీజేపీ నేతలు తమ నిరసన విరమించారు. అనంతరం దీంతో శనివారం ఉదయం తిరిగి నిమజ్జన శోభాయాత్ర మొదలై ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.

# చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి

**ఆమె చేసిన పోరాటం స్ఫూర్తిదాయకం**
**భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. శనివారం చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా ఆమె ధైర్యంగా పోరాడారని తెలంగాణ రైతాంగ పోరాటంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి మహిళల్లో స్ఫూర్తిని నింపారని పేర్కొన్నారు. మహనీయుల చరిత్రను భావితరాలకు అందించడంతో పాటు వారి ఆశయాలకు అనుగుణంగా సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లి ఆమె ఆశయాల సాధనకు కృషి చేయాలని అన్నారు. ఐలమ్మ పోరాటాలు ఆశయాలను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి విజయలక్ష్మి, జిల్లా అధికారులు, బీసీ సంఘాల నాయకులు నేరెళ్ల రమేష్, అజిత్ కుమార్, కే.వంశీ, పి.కొండల్, పి.శంకర్, మల్లయ్య, ఎన్.మోహన్ రావు, కొదుమూరి సత్యనారాయణ, జి.సత్యనారాయణ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# మహిళా శక్తికి ప్రభుత్వం పెద్దపీట

**ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో మహిళలకు చీరల పంపిణీ**

**పెద్దపల్లి మహా :** మహిళల సంక్షేమం, సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను అమలు చేస్తోందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణరావు అన్నారు. శనివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్ఆర్ గార్డెన్స్‌లో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా పట్టణ మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణరావు స్థానిక నాయకులతో కలిసి మహిళలకు చీరలను పంపిణీ చేశారు. 'రేవంతన్న కానుక'గా మహిళలకు చీరలను అందజేస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. పెద్ద సంఖ్యలో మహిళలు కార్యక్రమానికి హాజరై చీరలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు అవసరమైన సహకారం, ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. మహిళల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడే విధంగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని నాయకులు పేర్కొన్నారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై పలువురు మహిళలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, అధికారులు, పెద్ద సంఖ్యలో పట్టణ మహిళలు పాల్గొన్నారు.




# అభివృద్ధి పనులపై సమీక్ష!

**పెద్దపల్లి మహా :** శ్రీరాంపూర్: మండల ప్రజా పరిషత్ సమావేశం శనివారం శ్రీరాంపూర్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశానికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష హాజరై మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.మండలంలోని వివిధ గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతి, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, ఎదురవుతున్న సమస్యలపై అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో మండలంలోని సర్పంచులు, మార్కెట్ కమిటీ చైర్మన్, వివిధ శాఖల అధికారులు పాల్గొని మండల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాల్వ శ్రీరాంపూర్ తహసీల్దార్ రాపల్లి రాముడు, ఎంపీడీవో సురేందర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అవినీతికి తావు లేకుండా ఆలయ నిర్మాణం చేపట్టాలి

**యం సి పి ఐ(యు) రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున**



**కాట్రపల్లి, మహా :** భారత మార్క్ స్ట్ కమ్యూనిస్టు పార్టీ (ఐక్య) అధ్వర్యంలో ఎండోమెంట్ వరంగల్ కార్యాలయంలో సూపర్డెంట్ కుమారస్వామికి యం సి పి ఐ(యు) రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గడ్డం నాగార్జున మాట్లాడుతూ... గ్రామం కాట్రపల్లి మండలం కేసముద్రం జిల్లా మహబూబాబాద్ పరిధిలో ఉన్నటువంటి కాకతీయ రాజుల కాలం నుండి కాట్రపల్లి గ్రామంలో ప్రాచీనమైన శివ కోటేశ్వర ఆలయం ఉంది. ఈ ఆలయాన్ని ఇటీవల గుడి పునర్నిర్మాణం చేపడుతున్నారు. ఈ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ అవినీతికి తావు లేకుండా ఎలాంటి అవకతోకలు జరగకుండా, చర్యలు తీసుకోవాలని ఆలయ చైర్మన్ ను కూడా చట్టబద్ధంగా నియమించి, ఆలయ నిర్మాణానికి విడుదలైన రూ. 4కోట్ల 60 లక్షల రూపాయలను గుడి నిర్మాణం కోసమే ఖర్చు చేయాలని కోరారు. అదేవిధంగా సి సి కెమెరాల పర్యవేక్షణ లో పూర్తి స్థాయిలో నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# హనుమకొండలో మల్టీ లెవెల్ కారు పార్కింగ్ ఏర్పాటు పై సమీక్ష

**పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని, జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్**



**హనుమకొండ, మహా ;** హనుమకొండ నగరంలో ట్రాఫిక్, పార్కింగ్ సమస్యల పరిష్కారానికి సంబంధించి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సమీక్షా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్, బల్దియా ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, సిటీ ప్లానర్ రవీంద్ర రడేకర్ లతో ఎమ్మెల్యే మల్టీ లెవెల్ కారు పార్కింగ్ ఏర్పాటుకు సంబంధించిన వివిధ అంశాల పై సమీక్షించారు. హనుమకొండలోని అశోక జంక్షన్ సమీపంలోని ఉన్న మున్సిపల్ స్థలంలో మల్టీ లెవెల్ కారు పార్కింగ్ ఏర్పాటు చేసే ప్రతిపాదనల పై సమావేశంలో ఎమ్మెల్యే చర్చించారు. హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కన్సల్టెంట్ ప్రతినిధులు పాల్గొని హనుమకొండలో ఏర్పాటు చేయనున్న మల్టీ లెవెల్ కారు పార్కింగ్ గురించిన ప్రతిపాదనలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రతిపాదిత స్థలంలో పార్కింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తే ప్రస్తుతం ఉన్న ట్రాఫిక్ రద్దీ, పార్కింగ్ సమస్యలకు పరిష్కారం లభించనుందని వారు తెలిపారు.



# మామునూర్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనుల పరిశీలన

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్, మామునూర్ మహా ;** వరంగల్ మామునూర్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి సంబంధించి వివిధ శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ, అవసరమైన పనులను నిర్ణీత ప్రణాళిక ప్రకారం ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు .ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్, ఆర్డీవో సుమ, ఖిలా వరంగల్ తహసిల్దార్ ఇక్బాల్, ఆర్ అండ్ బి ఈఈ రాజేందర్, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారి నటరాజ్, ఇరిగేషన్ డి ఇ సురేష్ బాబు , డి.ఇ మధుసూదన్, ఖిలా వరంగల్ నేషనల్ హైవే డి ఇ అమీర్ పాషా తదితర సంబంధిత అధికారులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

# తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళి

- డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి



**హనుమకొండ, మహా ;** తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను హనుమకొండ జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా న్యూ శాయంపేటలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ పోరాటానికి, హక్కుల సాధనకు చాకలి ఐలమ్మ చూపిన చొరవ, ధైర్యం ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. బహుజనుల హక్కుల కోసం, భూమి కోసం ఆమె చేసిన పోరాటం చరిత్రలో నిలిచి పోతుందన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, వివిధ రజక సంఘాల ముఖ్య నాయకులు పాల్గొని వీరనారి ఐలమ్మకు శ్రద్ధాంజలి ఘటించారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ కొత్త ఓటర్ల జాబితా తయారీకి షెడ్యూల్

**హనుమకొండ, మహా;** వరంగల్,ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ కొత్త ఓటర్ల జాబితా తయారీకి షెడ్యూల్ విడుదలైనట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి చాహత్ బాజ్ పాయి శనివారం ఓ ప్రకటన లో తెలిపారు. 2026 నవంబర్ 1న అర్హత తేదీగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు.1 11 2023 కంటే ముందు డిగ్రీ పూర్తి చేసిన అర్హత కలిగిన అభ్యర్థులు ఫాం18 దరఖాస్తును ఏఈఆర్ఓ లకు లేదా నియమిత అధికారికి అంద చేయాలన్నారు. సెప్టెంబర్ 28 న నోటిస్ ను ఈఆర్ఓ, అదనపు కలెక్టర్ నల్గొండ శ్రీనివాస్ జారీ చేయనున్నారు. అక్టోబర్ 15, 25 న పత్రికల్లో నోటీసుల పునఃప్రచురణ ఉంటుందని నవంబర్ 6 వరకు ఫారం18 దరఖాస్తులు కరిస్తారు.నవంబర్ 20 వరకు ముసాయిదా జాబితా తయారీ, ముద్రణ ప్రక్రియ పూర్తిచేసి, నవంబర్ 25న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. అదే రోజు నుంచి డిసెంబర్ 10 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తారు. డిసెంబర్ 25లోగా వాటిని పరిష్కరించి సప్లిమెంట్లను సిద్ధం చేస్తారు. డిసెంబర్ 30 తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు.



# పార్కులు, సెంట్రల్ మీడియన్లలో పచ్చదనం విస్తరించాలి

- నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదు
- జిడబ్ల్యూఎంసి కమిషనర్ టి. వెంకన్న

**వరంగల్, కార్పొరేషన్ మహా;** పార్కులు, సెంట్రల్ మీడియన్లలో పచ్చదనం మరింత మెరుగు పరిచి విస్తరించాలని జిడబ్ల్యూఎంసి కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. గ్రేటర్ వరంగల్ నగరంలో హార్టికల్చర్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పార్కులు, సెంట్రల్ మీడియన్లు, గ్రీనరీ అభివృద్ధి పనులను శనివారం కమిషనర్ హార్టికల్చర్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కాజీపేట, సోమిడి సెంట్రల్ మీడియన్, ఎక్సైజ్ కాలనీలోని కనకదుర్గ పార్క్, పబ్లిక్ గార్డెన్, ప్రాంతాల్లో పచ్చదనం, సుందరీకరణ, మొక్కల సంరక్షణ, నిర్వహణ తీరును పరిశీలించారు. అదేవిధంగా వరంగల్ కోట చెరువు బండ్ వద్ద చేపట్టిన ప్లాంటేషన్ పనులను, లేబర్ కాలనీలోని టీఆర్టీ పార్కులో నూతనంగా చేపట్టిన గ్రీనరీ, సుందరీకరణ పనులను పరిశీలించారు. పార్కులు, మీడియన్లలో నాటిన మొక్కలను నాణ్యత తో సంరక్షిస్తూ, నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. మొక్కల పెరుగుదలకు అవసరమైన నీటి సరఫరా, నిర్వహణ, పరిశుభ్రత పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. చేపట్టిన పనుల బిల్లుల చెల్లింపులకు సంబంధించి అవసరమైన వివరాలను పరిశీలించి, పనుల నాణ్యతకు అనుగుణంగానే చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. నగర సుందరీకరణలో భాగంగా అభివృద్ధి చేస్తున్న ప్రతి గ్రీన్ స్పేస్ ఆకర్షణీయంగా, ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని, నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని కమిషనర్ సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ హన్మకొండ పబ్లిక్ గార్డెన్, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన మిస్ట్ బస్ స్టాప్ లను పరిశీలించారు. వేసవి తాపం నుంచి ప్రయాణికులకు ఉపశమనం కలిగేలా మిస్ట్ బస్ స్టేషన్లు సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.కమిషనర్ వెంట చీఫ్ హార్టికల్చర్ ఆఫీసర్ లక్ష్మారెడ్డి, హార్టికల్చర్ అధికారి ప్రశాంత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# భూమికోసం భుక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ

- నివాళులు అర్పించిన ఎమ్మెల్యేలు, కలెక్టర్లు

**హనుమకొండ, మహా ;** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, ధీర వనిత చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా హంటర్ రోడ్డు శాయంపేట లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట శాసనసభ్యులు కె.ఆర్. నాగరాజు, పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి, గ్రంథాల చైర్మెన్ మీసాల ప్రకాశ్ , వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్ పాల్గొని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు ,సంబధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల హక్కుల కోసం జేఏసీ పోరాటాం

- కమిషనర్‌కు సమ్మె నోటీస్ అందజేసిన జేఏసీ



**వరంగల్, మహా ;** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో సంవత్సరాలుగా వివిధ విభాగాలు, వివిధ క్యాడర్లలో పనిచేస్తూ ప్రజలకు నిరంతరం ఆరోగ్య సేవలు అందిస్తున్న సుమారు 15000 వేల మంది నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఎన్ హెచ్ ఎం జేఏసీ తదుపరి కార్యాచరణను ప్రకటించింది. రెగ్యులరైజేషన్, ఉద్యోగ భద్రత, సమాన వేతనం, పిఆర్సి పెండింగ్ వేతనాలు, ఇన్క్రిమెంట్లు, లాయల్టీ బోనస్, మాతృత్వ సెలవులు, ఇన్సూరెన్స్ తదితర సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఎన్ హెచ్ ఎం జేఏసీ డిమాండ్ చేస్తోంది.

**సెప్టెంబర్ 28 న చలో కమిషనరేట్**

ఈ నేపథ్యంలో శనివారం హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో జేఏసీ ప్రతినిధులు ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు సెప్టెంబర్ 28 సోమవారం సాధారణ సెలవు ఇవ్వాలని అడిషనల్ డిఎంహెచ్వో డాక్టర్ మదన్ మోహన్ రావు ,డాక్టర్ కృష్ణారావు లకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఎం జేఏసీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ నవీన్ ఎన్ హెచ్ ఎం జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుక్మద్దీన్ , జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్ ,రహమాన్, రాష్ట్ర కోశాధికారి మొగిలి నరేష్ , జ్యోతి, శిరీష,వినోద్ , రాకేష్ తదితరులు ఉన్నారు.



# మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి
- జిల్లా కలెక్టర్ తో కలిసి వంద పడకల ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలను ప్రారంభించిన ఎమ్మెల్యే

**పరకాల, మహా :** నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలను అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం పరకాలలో నూతనంగా నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చిన వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి లో ఓపి వైద్య సేవలను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయితో కలిసి ప్రారంభించారు. ముందుగా గణపతి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే, కలెక్టర్ అధికారులు పాల్గొనగా అనంతరం ఆసుపత్రిలోనే వైద్యులతో ఎమ్మెల్యే స్వయంగా తన ఆరోగ్య పరీక్షలను చేసుకొని ఓపి సేవలను ప్రారంభించారు. ఆసుపత్రిలో ఫార్మసీ, జనరల్ వార్డు, గైనిక్, ఏఎన్సి , ల్యాబోరేటరీ, ఇతర విభాగాలను శాసనసభ్యులు, కలెక్టర్, వైద్యఅధికారులు ప్రారంభించారు. అనంతరం వైద్యం కోసం వచ్చిన పేషంట్ లకు వైద్యులు వివిధ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశం లో ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ... పరకాలలో నూతనంగా నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రితో ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగపడే విధంగా మెరుగైన, నాణ్యమైన వైద్య అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. ఆసుపత్రిలో ఓపీ సేవలు అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఆస్పత్రిలో ఇంకా ఏమైనా వైద్య సదుపాయాలు కావాలంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి తగ్గట్టుగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. వైద్యులు, సిబ్బంది ఆసుపత్రిలో వైద్య సేవల నిమిత్తం 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. వైద్య పరంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించినప్పుడే ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు ధీటుగా తెలంగాణ లోని ప్రభుత్వ ఆసుపత్రులలో అధునాతన వైద్య సౌకర్యాలను ప్రభుత్వం కల్పించిదన్నారు.వైద్యులందరి సహకారం తో ఆసుపత్రికి A+ కేటగిరి వచ్చేలా అభివృద్ధి చేస్తామన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కల్పించిన వైద్య సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో వివిధ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. వైద్యులు కూడా సమయపాలన పాటించి నిరుపేద రోగులకు అందుబాటులో ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ పవన్, ఆర్డీవో డివిఎస్ వెంకన్న, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వంశీకృష్ణ, పలువురు ప్రజాప్రతినిధులు, వైద్యులు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర స్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమం

**ఘట్కేసర్, (మహా):** పోచారం డివిజన్ వెంకటాపురం లోని శ్రీ స్వయంభూ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. అనంతరం ఘట్కేసర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేశపావుల వినోద్ కుమార్, వారి కుటుంబ సభ్యులు కేశపావుల మల్లికార్జున్ గారి ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు .ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పొన్నం తరుణ్ గౌడ్, పోచారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కర్ర రాజేష్, సెక్రటరీ నర్సింగ్, జిల్లా కార్యదర్శి బండ్లగూడ క్రాంతి గౌడ్, ఆలయ చైర్మన్ నిరుదు కుమార్, గ్రామ అధ్యక్షుడు నిరుదు వెంకటేష్, యూత్ నాయకుడు సాయి ముదిరాజ్ పాల్గొన్నారు.వందలాది మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందారు, ప్రతి శనివారం ఈ అన్నదానం కొనసాగుతుందని కమిటీ తెలిపింది.



# మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

- అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలను ప్రారంభించిన వరంగల్ సీపీ

**హనుమకొండ, మహా :** హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో జరుగుతున్న 12వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలను శనివారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత ఐపీఎస్, ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ, క్రీడలు మానసిక ఉల్లాసానికి శారీరక దృఢత్వానికి ఎంతో దోహద పడతాయని తెలిపారు.అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలు జేఎన్ఎస్ స్టేడియం క్రీడాకారులకు ఒక వరమని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, క్రీడల్లో విజయం సాధించడం కంటే పాల్గొనడమే గొప్ప విజయం అని సూచించారు.

# ఐ.సి.జే.ఎస్, సి.ఎస్.ఐ. వినియోగంపై మంచిర్యాల జిల్లా న్యాయస్థానంలో సమీక్షా



**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లా సెషన్స్ కోర్టులో ఐసీజేఎస్, సీఐఎస్ వినియోగం, కేసుల పురోగతిపై శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ. వీరయ్య, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ పాల్గొన్నారు. ఈఎఫ్ఐఆర్, ఈచార్జిషీట్ , ఈసమ్మన్స్, సీసీటీఎన్ఎస్ సమాచార నవీకరణ, చార్జిషీట్ల దాఖలు, పోలీస్-న్యాయశాఖల మధ్య సమన్వయంపై సమీక్షించారు. పెండింగ్ కేసులను వారానికోసారి పరిశీలించి, నిర్ణీత గడువులో చార్జిషీట్లు దాఖలు చేయాలని సీపీ సూచించారు. క్షేత్రస్థాయి సమస్యలను గుర్తించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, పోలీస్, కోర్టు సిబ్బంది, లైజన్, ఐటీ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. సమావేశంలో ఏసీపీలు ఆర్. ప్రకాశ్, వి. కిరణ్‌కుమార్, ఏ. వెంకటేశ్వర్లు, న్యాయమూర్తులు, పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం: రామగుండం సీపీ



**పెద్దపల్లి మహా :** తెలంగాణ వీరవనిత, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఐపీఎస్, అధికారులు, సిబ్బందితో కలిసి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పెత్తందార్ల దురాగతాలకు, నాటి నిరంకుశ రజాకార్లు, దేశ్‌ముఖ్‌లకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ మొక్కవోని ధైర్యంతో పోరాడిన తీరు అందరికీ ఆదర్శనీయమని అన్నారు. ఆమె సాగించిన పోరాటం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి స్ఫూర్తినిచ్చిందని పేర్కొన్నారు. మహిళా చైతన్యానికి, ఆత్మగౌరవానికి చాకలి ఐలమ్మ ఒక ప్రతీక అని, ఆమె ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సీపీ సూచించారు. ఆమె త్యాగం, పోరాట స్ఫూర్తి నేటి తరానికి కూడా ఆదర్శమని అన్నారు. చాకలి ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలోని పేదలు, బలహీన వర్గాలు, బాధితులకు అండగా నిలిచి సేవ చేయాలని తెలిపారు. పోలీసులుగా ప్రజలకు భరోసా కల్పించడం, బాధితులకు న్యాయం అందించడం తమ బాధ్యత అని అన్నారు. ప్రజాసేవకు మరింత అంకితభావంతో పనిచేయడమే చాకలి ఐలమ్మకు అందించే నిజమైన నివాళి అని సీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ఏఓ శ్రీనివాస్, ఆర్ఐలు శేఖర్, సీసీ సందీప్, సీపీఓ సిబ్బంది, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

**క్యాతనపల్లి, మహా :** రామకృష్ణాపూర్ పట్టణంలోని రాజీవ్ చౌక్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు నడిగోట తిరుపతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్యాయం, దోపిడీకి వ్యతిరేకంగా ఆమె చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ సాగించిన పోరాటాన్ని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

# పూల డ్రెస్‌లో తాప్సీ మెరుపులు

**సినిమాబ్యూరో, మహా:** అందంతో పాటు విభిన్నమైన ఫ్యాషన్ స్టైలింగ్‌తోనూ తరచూ ఆకట్టుకునే బాలీవుడ్ నటి తాప్సీ పన్ను మరోసారి తన లుక్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. తాజాగా ఆమెకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నలుపు, లేత రంగుల కలయికతో రూపొందిన పూల ప్రింట్ మినీ డ్రెస్‌లో తాప్సీ స్టైలిష్‌గా కనిపించింది. డ్రెస్‌పై ఉన్న పూల డిజైన్‌కు బంగారు రంగు వృత్తాకార అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తన లుక్‌కు తగ్గట్టుగా తాప్సీ హెయిర్ స్టైల్, ఫుట్ వేర్, యాక్సెసరీస్‌ను ఎంచుకుంది. కర్లీ హెయిర్‌తో పాటు బ్లాక్ షీర్ టైట్స్, మెటాలిక్ గోల్డ్ హీల్స్, బ్లాక్ క్లచ్‌తో ఆమె కనిపించింది. ఈ కలయిక మొత్తం లుక్‌కు మోడ్రన్ టచ్‌ను తీసుకొచ్చింది. సాధారణంగా కనిపించే పూల ప్రింట్‌ను ఆధునిక స్టైలింగ్‌తో మిళితం చేయడంతో ఈ ఫ్యాషన్ లుక్ ప్రత్యేకంగా నిలిచింది. తాప్సీకి ఫ్యాషన్‌పై ప్రయోగాలు చేయడం కొత్తేమీ కాదు. గతంలోనూ ఫ్లోరల్ డిజైన్లు, వెస్ట్రన్ వేర్‌తో ఆమె పలు సందర్భాల్లో కనిపించింది. సినిమాల్లో పాత్రలకు తగ్గట్టుగా తనను తాను మార్చుకునే తాప్సీ, వ్యక్తిగత ఫ్యాషన్‌లోనూ విభిన్నమైన ప్రయోగాలు చేస్తుంటుంది. తాజా ఫొటోల్లో ఆమె కాన్ఫిడెంట్ పోజులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. సోషల్ మీడియాలో ఈ ఫొటోలు వైరల్ అవుతుండటంతో నెటిజన్లు ఆమె కొత్త లుక్‌పై ఆసక్తి చూపిస్తున్నారు.తెలుగు ప్రేక్షకులకు 'ఝుమ్మంది నాదం' సినిమాతో పరిచయమైన తాప్సీ.. ఆ తర్వాత తమిళ, హిందీ చిత్రాల్లోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. 'పింక్', 'ముల్క్', 'థప్పడ్', 'హసీన్ దిల్‌రుబా', 'డంకీ' వంటి సినిమాలతో విభిన్నమైన పాత్రలు పోషించింది. 2026లోనూ ఆమె పలు ప్రాజెక్టులతో ప్రేక్షకుల ముందుకు వస్తోంది.





# స్టైలిష్ లుక్‌లో అనన్య సందడి

**తాజా ఫొటోషూట్ వివరాల ఆధారంగా, కాపీ కాకుండా తెలుగు న్యూస్‌పేపర్ స్టైల్‌లో విస్తరించిన కాపీ:**

మెరిసిపోతున్న అనన్య నాగళ్లసినిమాబ్యూరో, మహా: తెలుగు సినీ నటి అనన్య నాగళ్ల తన తాజా ఫొటోషూట్‌తో మరోసారి సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. వెండి మెరుపులు కలిగిన స్టైలిష్ మినీ డ్రెస్‌లో ఆమె చేసిన ఫొటోషూట్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ఆధునిక ఫ్యాషన్‌కు తగ్గట్టుగా రూపొందించిన ఈ లుక్‌లో అనన్య ఆత్మవిశ్వాసంతో కెమెరాకు పోజులిచ్చింది. ప్రత్యేకంగా రాత్రి వేళ స్పోర్ట్స్ కారు ముందు ఆమె ఇచ్చిన ఫొటోలకు మంచి స్పందన వస్తోంది. పొడవైన స్లీవ్స్‌తో కూడిన మెరిసే సిల్వర్ డ్రెస్ అనన్య లుక్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కారు, లైటింగ్, డ్రెస్ కలయికతో ఫొటోషూట్‌కు గ్లామరస్ టచ్ వచ్చింది. ఎలాంటి అతిశయోక్తి లేకుండా స్టైలిష్‌గా కనిపించేలా ఆమె తన లుక్‌ను మలుచుకుంది. సోషల్ మీడియాలో షేర్ అవుతున్న ఈ ఫొటోలు ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంటున్నాయి. ఇక సినిమాల విషయానికి వస్తే.. 'మల్లేశం' చిత్రంతో నటిగా పరిచయమైన అనన్య నాగళ్ల తన నటనతో గుర్తింపు తెచ్చుకుంది. అనంతరం 'వకీల్ సాబ్', 'ప్లేబ్యాక్', 'పిట్టకథలు' వంటి చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించింది. 'తంత్ర', 'అన్వేషి', 'డార్లింగ్' వంటి సినిమాల్లోనూ తనదైన శైలిలో మెప్పించింది. 'పొట్టేల్' సినిమాలో బుజ్జమ్మ పాత్ర ఆమె కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచింది. ఈ పాత్రకు తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డు కూడా దక్కింది. ప్రస్తుతం కూడా అనన్య పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులతో బిజీగా ఉంది. 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'తో పాటు 'లేచింది మహిళా లోకం', 'సంబరాల ఏటి గట్టు' వంటి సినిమాలు ఆమె తదుపరి ప్రాజెక్టులుగా ఉన్నాయి. నటనతో పాటు ఫ్యాషన్, ఫొటోషూట్లతోనూ అభిమానులకు దగ్గరవుతున్న అనన్య.. తాజా గ్లామరస్ లుక్‌తో మరోసారి వార్తల్లో నిలిచింది.

# మళ్లీ మోగిన సంపూ ఫోన్

**హైదరాబాద్, మహా:** నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన 'ది ప్యారడైజ్' చిత్రంలో సంపూర్ణేష్ బాబు పోషించిన బిర్యానీ పాత్రకు ప్రేక్షకుల నుంచి స్పందన లభిస్తోంది. సినిమా సక్సెస్ మీట్‌లో పాల్గొన్న సంపూర్ణేష్ బాబు తన కెరీర్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. సినిమా కోసం తాను చాలా కష్టపడ్డానని, తొలిసారి ఇంత పెద్ద ప్రాజెక్టులో కీలకమైన పాత్ర చేయడం కొత్త అనుభూతిని ఇచ్చిందని తెలిపారు.నాని ఇచ్చిన ప్రోత్సాహం తనకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని సంపూర్ణేష్ బాబు చెప్పారు. తన పాత్రకు సంబంధించిన సన్నివేశాలు, గెటప్ విషయంలో మొదట్లో కొంత ఆందోళనకు గురయ్యానని, సినిమా పూర్తవుతుందా లేదా అనే భయం కూడా కలిగిందని తెలిపారు. అయితే నాని తనకు అండగా నిలిచి ప్రోత్సహించారని పేర్కొన్నారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ప్రతి పాత్రను ప్రత్యేకంగా తీర్చిదిద్దారని, తనకు లభించిన అవకాశాన్ని పూర్తిస్థాయిలో ఉపయోగించుకునేందుకు ప్రయత్నించానని చెప్పారు. 'కొబ్బరిమట్ట' సినిమా తర్వాత తనకు ఫోన్ కాల్స్ తగ్గిపోయాయని, మధ్యలో పలు సినిమాలు చేసినప్పటికీ గతంలో వచ్చినంత గుర్తింపు దక్కలేదని సంపూర్ణేష్ బాబు తెలిపారు. ఇప్పుడు 'ది ప్యారడైజ్'తో మళ్లీ తనకు అవకాశాలు, ఫోన్ కాల్స్ వస్తున్నాయని చెబుతూ భావోద్వేగానికి గురయ్యారు. ఈ సినిమా తన కెరీర్‌లో ప్రత్యేకమైన అనుభూతిని మిగిల్చిందని పేర్కొన్నారు.



'ది ప్యారడైజ్'లో సంపూర్ణేష్ బాబు పోషించిన బిర్యానీ పాత్ర ఆయన గత చిత్రాల్లో కనిపించిన వినోదాత్మక పాత్రలకు భిన్నంగా ఉంటుంది. నాని స్నేహితుడిగా కథలో కీలకంగా కనిపించే ఈ పాత్ర సీరియస్ షేడ్స్‌తో రూపొందింది. ఇంతకుముందు తాను చేయని తరహా పాత్ర కావడంతో ఈ అవకాశాన్ని ప్రత్యేకంగా భావిస్తున్నానని సంపూర్ణేష్ బాబు గతంలో వెల్లడించారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో నాని ప్రధాన పాత్రలో నటించారు. విడుదల అనంతరం సినిమాపై మిశ్రమ స్పందనలు వచ్చినప్పటికీ, యాక్షన్ సన్నివేశాలకు మాస్ ప్రేక్షకుల నుంచి స్పందన కనిపిస్తోందని తాజా కథనాలు పేర్కొంటున్నాయి. సక్సెస్ మీట్ సందర్భంగా సంపూర్ణేష్ బాబు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో, సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.

# 43 ఏళ్లకే నటుడి విషాదాంతం

సినిమాబ్యూరో, మహా: ఫ్రెంచ్ నటుడు, రంగస్థల దర్శకుడు ఆర్నాడ్ డెనిస్ 43 ఏళ్ల వయసులో కన్నుమూశారు. తీవ్ర అనారోగ్య సమస్యలతో కొంతకాలంగా బాధపడుతున్న ఆయన బెల్జియంలోని నామూర్‌లో సెప్టెంబర్ 22న వైద్యుల పర్యవేక్షణలో యూథనేషియా ద్వారా మృతి చెందారు. ఈ విషయాన్ని ఆయన న్యాయవాది ఫిలిప్ కోర్ట్వా వెల్లడించారు. 2023లో కుడి తొడ భాగంలో హెర్నియా సమస్యకు ఆర్నాడ్ డెనిస్ శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆ సమయంలో పాలీప్రొపిలీన్ ప్రొస్థెసిస్‌ను అమర్చారు. ఆ తర్వాత తన ఆరోగ్యం క్రమంగా క్షీణించిందని ఆయన పలు సందర్భాల్లో వెల్లడించారు. తీవ్రమైన నొప్పులు, జీర్ణ సంబంధ సమస్యలు, కండరాల బలహీనత, ఇతర ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిపారు. ప్రొస్థెసిస్‌ను తొలగించినప్పటికీ తన ఆరోగ్యంలో ఆశించిన మార్పు రాలేదని చెప్పారు. తనకు ఎదురైన సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు డెనిస్ 'ఫ్రెంచ్ విక్టిమ్స్ ఆఫ్ హెర్నియా ప్రొస్థెసెస్' అనే సంఘాన్ని ఏర్పాటు చేశారు. హెర్నియా ఇంప్లాంట్ల తర్వాత సమస్యలు ఎదుర్కొంటున్నామని చెప్పిన పలువురు వ్యక్తుల అనుభవాలను ఈ వేదిక ద్వారా వెలుగులోకి తీసుకొచ్చారు. వైద్య వ్యవస్థ నుంచి తగిన పరిష్కారం లభించలేదని ఆయన గతంలో ఆవేదన వ్యక్తం చేశారు.ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారడంతో యూథనేషియాను ఎంచుకోవాలని నిర్ణయించుకున్నట్లు డెనిస్ గతంలోనే బహిరంగంగా చెప్పారు.



బెల్జియంలో ముగ్గురు వైద్యులతో సంప్రదింపుల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన న్యాయవాది తెలిపారు. ఇదే సమయంలో 2026 జనవరిలో తనకు ఎదురైన వైద్య సమస్యలపై ఫ్రాన్స్‌లో ఫిర్యాదు కూడా చేశారు. ఆ కేసును ఆగస్టు చివర్లో తగిన నేర ఆధారాలు లేవనే కారణంతో ముగించారు. ఆయన న్యాయవాది అనంతరం ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ మరో చర్య చేపట్టినట్లు తెలిపారు. ఆరోగ్య సమస్యలకు ముందు ఆర్నాడ్ డెనిస్ ఫ్రెంచ్ రంగస్థలంపై నటుడిగా, దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 2003లో 'లెస్ కంపాగ్నాన్స్ డి లా షిమేర్' అనే నాటక సంస్థను స్థాపించారు. క్లాసిక్ నాటకాలను ఆధునిక వేదికపై ప్రదర్శించడంలో ఆయనకు ప్రత్యేక ఆసక్తి ఉండేది. 'లెస్ లియాజన్స్ డాంజెర్యూస్', 'మారి డెస్ ఫూల్స్' వంటి ప్రదర్శనలకు దర్శకత్వం వహించారు. ఆయన మృతితో ఫ్రెంచ్ రంగస్థల కళా రంగంలో విషాదం నెలకొంది.

# శ్రీకాంత్‌పై మోహన్ బాబు ప్రశంసలు

సినిమాబ్యూరో, మహా: నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన 'ది ప్యారడైజ్' సినిమా ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన సీనియర్ నటుడు మోహన్ బాబు.. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల పనితీరుపై ప్రశంసలు కురిపించారు. 'ప్యారడైజ్ మీడియా ములాఖత్' కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. ఒక సినిమాకు దర్శకుడే కెప్టెన్ అని, కథను సరైన దిశలో నడిపించే బాధ్యత అతడిపైనే ఉంటుందని పేర్కొన్నారు. శ్రీకాంత్ ఓదెలలో మంచి కథను తెరపై ప్రభావవంతంగా చూపించే ప్రతిభ ఉందని మోహన్ బాబు అన్నారు. 'దసరా'తో తన దర్శకత్వ ప్రతిభను చాటుకున్న శ్రీకాంత్.. 'ది ప్యారడైజ్'లో మరింత భిన్నమైన ప్రపంచాన్ని సృష్టించారని పేర్కొన్నారు. దర్శకుడి ఆలోచనా విధానం, పని పట్ల ఉన్న నిబద్ధత తనను ఆకట్టుకున్నాయని తెలిపారు. ఈ సినిమాలో తాను పోషించిన పాత్ర గురించి కూడా మోహన్ బాబు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. తన సుదీర్ఘ నట జీవితంలో ఇంతటి తీవ్రమైన, రౌద్రభరితమైన పాత్ర చేయడం ఇదే తొలిసారి అన్నట్టుగా ఆయన వివరించారు. పాత్ర స్వభావాన్ని పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాతే షూటింగ్‌లోకి వెళ్లానని, తెరపై తన పాత్రను చూసినప్పుడు ప్రేక్షకులు ఆశ్చర్యపోయే విధంగా శ్రీకాంత్ దాన్ని రూపొందించారని చెప్పారు. ఒకే సన్నివేశం కోసం శ్రీకాంత్ అనేక టేక్‌లు తీసుకున్న విషయాన్ని కూడా మోహన్ బాబు గుర్తుచేసుకున్నారు. కళ్లలో రౌద్రం, ముఖ కవళికలు, బాడీ లాంగ్వేజ్ వంటి అంశాల్లో అనేక మార్పులు చేయిస్తూ తన నుంచి ఉత్తమ నటనను రాబట్టేందుకు దర్శకుడు ప్రయత్నించారని తెలిపారు. నటుడిలోని పూర్తి సామర్థ్యాన్ని బయటకు తీసేందుకు శ్రీకాంత్ చూపించిన పట్టుదల తనకు నచ్చిందని అన్నారు. శ్రీకాంత్ ఓదెల భవిష్యత్తుపైనా మోహన్ బాబు శుభాకాంక్షలు తెలిపారు. అతడికి మంచి ప్రతిభతో పాటు సినిమాపై స్పష్టమైన అవగాహన, కష్టపడే తత్వం ఉన్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని పెద్ద చిత్రాలు రూపొందిస్తూ జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. 'ది ప్యారడైజ్'లో నాని ప్రధాన పాత్రలో నటించగా, కాయదు లోహర్, రాఘవ్ జుయల్, మోహన్ బాబు తదితరులు కీలక పాత్రలు పోషించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంపై విడుదలకు ముందు నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com